శుక్రవారం 26, సెప్టెంబర్ 2025
https://www.telugudesam.org
చైతన్యరథం
సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


ఇచ్చిన మాట మేరకు..
**5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు**
- మార్పు ఇంటినుంచే మొదలవ్వాలి
- నూతన ఉపాధ్యాయుల ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానాలు

5

# ఇక ఏటా డీఎస్సీ

- బాబు ష్యూరిటీ... జాబు గ్యారెంటీ నినాదాన్ని నిజం చేశాం
- అత్యంత పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియ నిర్వహించాం
- విద్యార్థులకు టీచర్లు నైతిక విలువలు బోధించాలి
- ఉపాధ్యాయులూ ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతుండాలి
- మెగా డీఎస్సీ విజేతల సభలో సీఎం చంద్రబాబు పిలుపు
- సమర్థ నిర్వహణపై మంత్రి లోకేష్ టీంకు అభినందనలు
- కొత్త టీచర్లకు నియామక పత్రాలు అందించిన ముఖ్యమంత్రి

2





## భక్తుల సౌకర్యమే లక్ష్యంగా..
## తిరుమలలో అందుబాటులోకి నూతన వసతి సముదాయం

- రద్దీ, క్యూలైన్ల పర్యవేక్షణకు సమీకృత కమాండ్ కంట్రోల్ సెంటర్
- ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో కలిసి ప్రారంభించిన సీఎం చంద్రబాబు

6

## మెగా డీఎస్సీ బంపర్ హిట్

- పరిపూర్ణమైన సీఎం చంద్రబాబు తొలి సంతకం హామీ
- ఒక్క సంతకంతో 15,941మంది జీవితాల్లో వెలుగులు
- ఆద్యంతం వినూత్నంగా సాగిన మెగా డీఎస్సీ ఉత్సవ్

7



కలసికట్టుగా పనిచేసి..
## ఏపీ మోడల్ ఎడ్యుకేషన్‌ను ప్రపంచానికి చాటుదాం

- ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహణ
- నవంబర్‌లో మళ్లీ టెట్ .. టీచర్ పోస్టులన్నీ భర్తీచేస్తాం
- 150 కేసులు వేసినా 150రోజుల్లో విజయవంతంగా డీఎస్సీ పూర్తిచేశాం
- గురువుల మార్గదర్శనం వల్లే ఈ స్థాయికి చేరుకున్నా
- నా జీవితకాల గురువు నాన్న చంద్రబాబే
- మెగా డీఎస్సీ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి లోకేష్

3



తప్పు చేయను..
## చేసేవాళ్లను ఉపేక్షించను

- గత పాలనలో నాతో సహా ప్రజలంతా బాధితులే
- గత ప్రభుత్వ ఆరాచకాలకు నేనే మొదటి బాధితుడిని
- ప్రజాస్వామ్యం కోసం పోరాడితే పదుల్లో కేసులు పెట్టారు
- ఇప్పుడిక.. శాంతి భద్రతల విషయంలో రాజీ లేదు
- కూటమి వచ్చాకే మహిళలపై నేరాలు తగ్గుముఖం
- సోషల్ మీడియా ఫేక్ ప్రచారాల కుట్రల్ని ఛేదిస్తాం
- శాసన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన
- శాంతి భద్రతలపై స్వల్పకాలిక చర్చలో సీఎం సమాధానం

4



# ఇక ఏటా డీఎస్సీ



- బాబు ష్యూరిటీ... జాబు గ్యారెంటీ నినాదాన్ని నిజం చేశాం
- అత్యంత పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియ నిర్వహించాం
- విద్యార్థులకు టీచర్లు నైతిక విలువలు బోధించాలి
- ఉపాధ్యాయులూ ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతుండాలి
- మెగా డీఎస్సీ విజేతల సభలో సీఎం చంద్రబాబు పిలుపు
- సమర్థ నిర్వహణపై మంత్రి లోకేష్ టీంకు అభినందనలు
- కొత్త టీచర్లకు నియామక పత్రాలు అందించిన ముఖ్యమంత్రి

అమరావతి (చైతన్య రథం): ఇక ఏటా డీఎస్సీ నోటిఫికేషన్ ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షాతిరేకాల మధ్య ప్రకటించారు. నిరుద్యోగులు, ఈ ఏడాది డీఎస్సీలో క్వాలిఫై కానివారంతా ప్రిపరేషన్ ఆపొద్దని సూచించారు. ఇకపై ప్రతి ఏడాదీ డీఎస్సీ నిర్వహిస్తామని... దాని కోసం ప్రత్యేకంగా అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదని విద్యా మంత్రి నారా లోకేష్‌కు సీఎం చంద్రబాబు సూచించారు. మెగా డీఎస్సీలో విజేతలకు ఉపాధ్యాయ పోస్టుల నియామక పత్రాలను జారీ చేసే కార్యక్రమం గురువారం రాష్ట్ర సచివాలయం సమీపంలో పండువ వాతావరణంలో జరిగింది. వినూత్నంగా నిర్వహించిన కారక్రమానికి హాజరైన సీఎం చంద్రబాబు.. డీఎస్సీలో టీచర్లుగా ఎంపికైన 15,941మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. అన్ని జిల్లాలనుంచి నియామక పత్రాలు అందుకునేందుకు కుటుంబీకులతో సహా కొత్తగా రిక్రూట్ అయిన టీచర్లు తరలి రావడం విశేషం. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... "సీఎంగా బాధ్యతలు చేపట్టాక తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్‌పైనే పెట్టాను. అవినీతిలేకుండా పారదర్శకంగా డీఎస్సీ ప్రక్రియ చేపట్టాం. టీచర్లను నియమించాం. 150 రోజుల్లో ఈ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టిన మంత్రి నారా లోకేష్ బృందాన్ని అభినందిస్తున్నాను. ఇక టీచర్లుగా నియామక పత్రాలు తీసుకున్న ఉపాధ్యాయులను అభినందిస్తున్నాను. ఎన్నికల్లో హామీ ఇస్తూ -బాబు ష్యూరిటీ... జాబు గ్యారెంటీ అని చెప్పాను. దాన్ని నిజం చేశాను. రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులకు ఎంఓయూలు కుదుర్చుకున్నాం. 10 లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయి. పదిహేనేళ్లలో 14సార్లు డీఎస్సీని పెట్టాం. 1,96,619 ఉద్యోగాలిచ్చాం. ఇకపైనా ప్రతి ఏడాది డీఎస్సీ ఉంటుంది" అని సీఎం చంద్రబాబు ఆనందోత్సాహాల మధ్య ప్రకటించారు.

## చదువు చెప్పడంలో మహిళలే బెస్ట్

"సూపర్ సిక్స్ హామీల్లో మొదటి హామీ యువతకు 20 లక్షల ఉద్యోగాలివ్వడమే. దాంట్లో భాగంగా మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశాను. మెగా డీఎస్సీని సూపర్ హిట్ చేశారు. ఉద్యోగం సంపాదించాలన్న మీ కోరిక తీరింది. పేదరికంలేని సమాజం చూడాలనేది నా కోరిక. పేదరికంలేని సమాజాన్ని చూడాలంటే... విద్యతోనే సాధ్యం. దాన్ని టీచర్లే నెరవేర్చాలి. మగవాళ్లకంటే మహిళలే మంచిగా చదువు చెప్పగలరు. ఇంటిని కూడా మహిళలే చక్కగా తీర్చిదిద్దుతారు. అందుకే సంక్షేమ కార్యక్రమాలు అందించే విషయంలో మహిళలకే ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నాం. మహిళలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు తెచ్చాం. స్త్రీశక్తి ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. దీపం పథకం అమలు చేస్తున్నాం. తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలున్నా.. వారందరికీ రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్టయ్యింది. ప్రధాని సూపర్ జీఎస్టీ తెచ్చారు. ధరలు తగ్గించారు. దసరా, దీపావళి పండుగలను ఆనందంగా జరుపుకోవాలి. అభివృద్ధితో ఉద్యోగాలు వస్తాయి. ఆదాయం పెరుగుతుంది. సంక్షేమం సజావుగా సాగించవచ్చు" అని చంద్రబాబు ఉత్సాహంగా ప్రకటించారు.

## విద్యారంగాన్ని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు...

"తొలిసారిగా సీఎం అయినప్పటినుంచి విద్యపైనే ఎక్కువ శ్రద్ధ పెట్టాను. ఐటీ చదవమని ఆ రోజుల్లో చాలామందికి చెప్పాను. కొందరు నా మాటపై నమ్మకంతో పట్టణాలకు వచ్చి చదువుకున్నారు. ఆ రోజు చక్కగా చదువుకున్నవారు... ఇప్పుడు విదేశాలకు వెళ్లారు. బాగా స్థిరపడ్డారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రులందరూ కలిసి ఎంతమంది టీచర్లను నియమించారో... నేను ఒక్కడినే అంత మంది టీచర్లను నియమించాను. ఇదీ నేను విద్యారంగానికి ఇచ్చే ప్రాధాన్యత. విద్యారంగాన్ని నేను ఎప్పుడూ అశ్రద్ధ చేయలేదు. నిర్లక్ష్యం చూపలేదు. టీచర్లుగా బాధ్యతలు తీసుకున్న మీరంతా బాగా పని చేయాలి. మంచి పేరు తీసుకురావాలి. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చేలా టీచర్లంతా పని చేయాలి. విద్యారంగంలో సంస్కరణలు తెస్తున్నాం. సన్న బియ్యంతో రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. పేరెంట్- టీచర్ మీటింగులు నిర్వహిస్తున్నాం. మన బడి-మన భవిష్యత్ పేరుతో మౌలిక సదుపాయాల కల్పన చేపడుతున్నాం. టీచర్ల బదిలీల చట్టంతో పారదర్శకంగా ఒక్క ఫిర్యాదు కూడా లేకుండా టీచర్ల బదిలీలు పూర్తి చేశాం. నారా లోకేష్ నో బ్యాగ్ డే విధానం తెచ్చారు. ఇది వినూత్నంగా ఉంది. స్కూళ్లు తెరిచేలోగానే స్కూల్ కిట్లు, పుస్తకాలు ఇచ్చాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

## విలువలతో కూడిన విద్యనందించాలి

"విలువలతో కూడిన విద్యను అందించేలా టీచర్లంతా పని చేయాలి. పిల్లల్లో నైతిక విలువలను పెంచేలా టీచర్లు పాఠాలు చెప్పాలి. పిల్లల్లో నైపుణ్యాలు పెంచే బాధ్యత టీచర్లు తీసుకోవాలి. భవిష్యత్తులో విద్యారంగంలో ఎలాంటి మార్పులు రాబోతున్నాయోననేది టీచర్లు ఊహించగలగాలి. మారిన పరిస్థితులకు అనుగుణంగా టీచర్లు అప్డేట్ అవుతూ ఉండాలి. నేను నిత్య విద్యార్థిని. కొత్త విషయాలు నేర్చుకుంటాను. ప్రజలకు ఉపయోగపడే అంశాలుంటే వాటిని అమలు చేస్తాను. కూటమి ప్రభుత్వం వచ్చాకే విద్యా వ్యవస్థలో మార్పులు వచ్చాయి. నో అడ్మిషన్లు బోర్డులు పెట్టేస్థాయికి ప్రభుత్వ పాఠశాలలను తెచ్చారు. ఇది మరింతగా పెరగాలి. విద్యాశాఖ కఠినంగా ఉంటుందని చెప్పాను.. అయినా లోకేష్ ఛాలెంజ్‌గా తీసుకున్నారు. ప్రాథమిక విద్య బాగుంటే ఉన్నత చదువులూ అద్భుతంగా ఉంటాయి. దీంతో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తుంది" అని సీఎం చంద్రబాబు టీచర్లకు దిశానిర్దేశం చేశారు.


## మంచి చేయరు... చేస్తే ఓర్వలేరు

"ఏపీలో ఓ చేతకాని పక్షముంది. ఆ చేతకాని పక్షం మంచి చేయదు. మంచి జరుగుతుంటే ఓర్వలేదు. డీఎస్సీని అడ్డుకునేందుకు 106 కేసులు వేశారు. కానీ ఇబ్బందులను అధిగమించి డీఎస్సీ నిర్వహించారు. పోస్టింగుల కోసం పైరవీలు చేసే పరిస్థితి గతంలో ఉండేది. కానీ టీడీపీ ప్రభుత్వంలో ఎప్పుడూ ప్రతిభ ఆధారంగానే పోస్టింగులు ఇచ్చాం. 2019-24 మధ్యకాలం విద్యా వ్యవస్థకు ఓ శాపం. 10 లక్షలమంది పిల్లలు గత పాలకుల హయాంలో ప్రభుత్వ స్కూళ్లనుంచి ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లిపోయారు. ఏపీ విద్యారంగాన్ని 19వ స్థానానికి దిగజార్చారు. ఇంగ్లిష్ మీడియం పేరుతో ప్రాథమిక విద్యా వ్యవస్థను నాశనం చేశారు. తెలుగు మీడియంను రద్దు చేశారు. ఇంగ్లిష్ మీడియం అంటూ కొందరిని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. రాజకీయాల కోసం విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారు" అని ముఖ్యమంత్రి గత ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు.

## టీచర్లతో ముఖాముఖి

గతంలో జరిగిన కార్యక్రమాలన్నింటికంటే భిన్నంగా జరిగిన ఈ సభలో కొత్తగా నియమితులైన టీచర్లతో సీఎం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తనను రాజకీయాల్లో ప్రోత్సహించిన ఎకనామిక్స్ ప్రొఫెసర్ డీఎల్ నారాయణను ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. పిల్లలను ప్రోత్సహిస్తే.. ఎంతటి కష్టమైన పనినైనా సులభంగా సాధిస్తారని సీఎం అన్నారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను గమనించాలని... సమాజానికి మంచి పేరు తెచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, విద్యాశాఖ ఉన్నతాధికారులు, బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.






## కలసికట్టుగా పనిచేసి..

# ఏపీ మోడల్ ఎడ్యుకేషన్‌ను ప్రపంచానికి చాటుదాం

- ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహణ
- నవంబర్‌లో మళ్లీ టెట్.. టీచర్ పోస్టులన్నీ భర్తీచేస్తాం
- 150 కేసులు వేసినా 150రోజుల్లో విజయవంతంగా డీఎస్సీ పూర్తిచేశాం
- గురువుల మార్గదర్శనం వల్లే ఈ స్థాయికి చేరుకున్నా
- నా జీవితకాల గురువు నాన్న చంద్రబాబే
- మెగా డీఎస్సీ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి లోకేష్



అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన విధంగా ఇకపై ప్రతిఏటా డీఎస్సీ నిర్వహిస్తాం, నవంబర్‌లో టెట్ చేపడతాం, వచ్చేఏడాది మళ్లీ పారదర్శకంగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అమరావతిలోని సచివాలయం సమీప ప్రాంగణంలో గురువారం జరిగిన మెగా డీఎస్సీ విజేతలకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... 150 రోజుల్లో డీఎస్సీ నిర్వహించడం ఒక చరిత్ర, ఇది నెవర్ బిఫోర్, ఎవర్ ఆఫ్టర్ అన్నారు. రాష్ట్ర ప్రజలందరి ఆశీస్సులతో మాకు మూడుతరాలు డీఎస్సీ ప్రకటించే అవకాశం వచ్చింది. ఎన్టీఆర్, చంద్రబాబు తర్వాత నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు చేతులెత్తి నమస్కరిస్తున్నా. సమష్టి కృషితో ప్రభుత్వ విద్యావ్యవస్థను దేశానికే దిక్సూచిగా మారుద్దాం..ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కోసం అంతా కలసికట్టుగా కృషిచేద్దాం. విద్యారంగాన్ని రాజకీయాలకు అతీతంగా ఉంచేందుకు వ్యవస్థలో పలు కీలకమైన సంస్కరణలు తెచ్చాం. సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో విద్యార్థిమిత్ర, డొక్కా సీతమ్మ పేరిట మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నాం. ప్రాథమిక విద్యలో నాణ్యత పెంచేందుకు 9600 స్కూళ్లలో వన్ క్లాస్- వన్ టీచర్ విధానాన్ని తెచ్చాం. విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వరరావుని క్యాబినెట్ ర్యాంకుతో సలహాదారుగా నియమించాం. కారు, ఫోన్ తోపాటు కనీసం బాటిల్ నీరు కూడా ఆయన తీసుకోలేదు. ఆయన నిబద్ధతను అభినందిస్తున్నా. నైతిక విలువలపై తాను రాసిన నాలుగు పుస్తకాలను విద్యార్థులకు అందించాలని ఆయన కోరారు. మహిళలను గౌరవించడం నర్సరీ నుంచే నేర్పించాలి. మార్పు మన ఇంటినుంచే రావాలి. మా ఇంట్లో మా తల్లిని ఎంతో గౌరవిస్తున్నాం. 1,2 తరగతుల పుస్తకాల్లో ఇంటిపనుల ఫోటోలను చెరో సగంగా ఉండేలా మార్పులు చేశాం. పాఠశాల విద్యలో అనేక సంస్కరణలు తీసుకువచ్చాం. విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గించాం.. శనివారం నో బ్యాగ్ డే అమలు చేస్తున్నాం. నైతిక విలువలు, లింగ సమానత్వం, రాజ్యాంగం గురించి పాఠాలు రూపొందించామని మంత్రి లోకేష్ తెలిపారు.

### డీఎస్సీ అంటే సీబీఎన్...

తెలుగుదేశంపార్టీ విద్యకు ఎప్పుడూప్రథమ ప్రాధాన్యత ఇస్తోంది. సీబీఎన్ అంటే డీఎస్సీ... డీఎస్సీ అంటేనే సీబీఎన్‌గా పేరుపడింది. ఇప్పటివరకూ 14 సార్లు డీఎస్సీలు నిర్వహించి 2 లక్షల టీచరు పోస్టులు భర్తీ చేశాం. సెప్టెంబర్ 5న టీచర్స్ డే కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఆయన సీఎంగా ఉన్నప్పుడు నిర్వహించిన డీఎస్సీలో ఎంపికైన వారు చేతులు ఎత్తాలని కోరితే...హాలులో 99శాతం మంది చేతులు ఎత్తారు. ఇదీ తెలుగుదేశంపార్టీ ఘనత... ఇదీ చంద్రబాబు డీఎస్సీల చరిత్ర. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన రోజున తొలి సంతకం మెగా డీఎస్సీపై పెట్టారు. చాలా మంది హేళనగా మాట్లాడారు.. కొందరు విమర్శించారు. కానీ డీఎస్సీల నిర్వహణలో టీడీపీ, చంద్రబాబు ట్రాక్ రికార్డు వీరెవ్వరికీ తెలియదు. బాబు ఒక్కసారి కమిటైతే.. ఆ టాస్క్ కంప్లీట్ అయ్యే వరకూ ఆగరని ఈ డీఎస్సీ రిక్రూట్మెంట్ స్పష్టం చేసిందని మంత్రి లోకేష్ అన్నారు.

### అడ్డుకోవాలనే కుట్రతో కేసులు వేయించారు

డీఎస్సీ ఎట్టి పరిస్థితుల్లో జరగకూడదనే కుట్రతో కొందరు 150కిపైగా కేసులు వేయించారు. అధికారులు.. న్యాయ సలహాలు తీసుకుంటూ ఎటువంటి లీగల్ సమస్యలు రాకుండా చూసుకున్నారు. 150 కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటూనే 150రోజుల్లో డీఎస్సీ విజయవంతంగా నిర్వహించారు. మెగా డీఎస్సీ మెగా హిట్ కావడానికి కృషిచేసిన అధికారులు కోన శశిధర్, విజయరామరాజు, బి.శ్రీనివాసరావు, ఆకుల వెంకటరమణలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మెగా డీఎస్సీ ప్రక్రియను 150 రోజుల్లోనే పూర్తిచేసి రికార్డు సృష్టించాం. సుమారుగా 16 వేల పోస్టులు ఒకేసారి భర్తీ చేయడం మరో రికార్డు. ఎస్సీ వర్గీకరణ జరిగిన తర్వాత నిర్వహించిన మొదటి డీఎస్సీలోనే దానిని అమలు చేశాం. స్పోర్ట్స్ కోటా 3శాతం కూడా ఈ డీఎస్సీలో అమలు చేశాం. మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, స్పోర్ట్స్ కోటా సహా అన్ని కేటగిరీల్లో వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లు పకడ్బందీగా పాటించాం. విద్య, ఉద్యోగ,ఉపాధి, రాజకీయ రంగాల్లో పురుషులకు సమానంగా మహిళలకు అవకాశాలు దక్కాలని తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి పనిచేస్తోంది. గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి అత్యధికంగా డీఎస్సీలో 49.9శాతం పోస్టులను మహిళలు దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

### యువగళం యాత్రలోనే మెగా డీఎస్సీ ఆలోచన


ఇంట్లో మొదటి గురువు అమ్మ. హెడ్ మాస్టర్ నాన్న. బడిలో గురువులే అమ్మానాన్నలు. అమ్మానాన్నల తరువాత పిల్లలు ఎక్కువ ఉండేది టీచర్ల తోనే. ప్రపంచంలో ఒక గొప్ప ఆస్తి ఉంది. అది దొంగలు దోపిడీ చెయ్యలేరు. అన్నదమ్ములు వాటాలు అడగరు. ఇతరులు మోసం చేసి తీసుకోలేరు. అదే విద్య. ఎంతో విలువైన విద్య అనే ఆస్తిని ఇప్పుడు ఎంపికైన టీచర్లందరూ పిల్లలకు ఇవ్వబోతున్నారు. యువగళం పాదయాత్ర నుండి పుట్టింది మెగా డీఎస్సీ ఆలోచన. పాదయాత్రలో నడిచేప్పుడు యువతీయువకులతో మాట్లాడితే వాళ్ళు ఒక్కటే చెప్పేవారు. మేమంతా ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్నాం. వైసీపీ ప్రభుత్వం ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదు. మీరు అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ వేయాలి అని కోరేవారు. అప్పుడే మెగా డీఎస్సీ ఆలోచన మొదలైంది. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక తొలి సంతకం డీఎస్సీపైన పెడతారని అప్పుడే చెప్పాను. నూతన ఉపాధ్యాయులంతా పట్టుదల, కమిట్‌మెంట్‌తో పనిచేయాలి. విద్యావ్యవస్థలో మార్పుతేవాలి. విద్య అంటే ఫిన్‌ల్యాండ్, ఢిల్లీ మాత్రమే కాదు. ఆంధ్రా మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రపంచానికి చూపాల్సిన బాధ్యత మీ అందరిపై ఉంది. వ్యవస్థలో మార్పు తెస్తానని విద్యాశాఖను కోరి మరీ తీసుకున్నా. అందరం కలసికట్టుగా పనిచేద్దాం, ప్రపంచానికి ఆంధ్రామోడల్ చూపిద్దాం. అయిదేళ్లలో ప్రతి విద్యార్థికి గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ అందిద్దాం. ఉత్తమ ఉపాధ్యాయులను ఫిన్‌ల్యాండ్, సింగపూర్ దేశాలకు అధ్యయనం కోసం పంపించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

### గురువుకు దక్కిన గొప్పగౌరవం

ఒక గురువు దక్కిన గొప్ప గౌరవం గురించి ఈ రోజు మీకు చెబుతాను. అది అక్టోబర్ 3, 1996 సంవత్సరం. అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ ఒమన్ దేశం అధికారిక పర్యటనకు వెళ్లారు. మస్కట్ ఎయిర్ పోర్టుకు ఏకంగా ఒమన్ రాజు ఖబూస్ బిన్ సైద్ వచ్చేశారు. ఆ దేశ అధికారులంతా కంగారు పడిపోయారు. ప్రోటోకాల్ నిబంధనలు పక్కనపెట్టి రాజు ఎయిర్ పోర్టుకి రావడం ఏంటని షాక్ అయ్యారు. తాము ఏమైనా తప్పు చేశామా అని అందరూ భయపడుతున్నారు. డాక్టర్ శంకర్ దయాళ్ శర్మను ఒమన్ రాజు సాదరంగా స్వాగతించారు. రాజు తన కారులో శంకర్ దయాళ్ శర్మను ఎక్కించుకుని, తానే డ్రైవ్ చేసుకుంటూ తీసుకెళ్లారు. ఏమీ అర్థంకాని ఒమన్ ఉన్నతాధికారులు.. ప్రోటోకాల్ ఇలా బ్రేక్ అవడంపై సీరియస్ అయ్యారు. ఒమన్ రాజభవనంలోకి చేరాక తెలిసింది ఏంటంటే ఒమన్ రాజు గతంలో పూణేలో చదువుకున్నారు. అప్పుడు ఆయనకు పాఠాలు చెప్పింది మన శంకర్ దయాళ్ శర్మ అట. ఒమన్ రాజు తన గురువుకి ఇచ్చిన గౌరవం చూశారు కదా. దేవుడు, గురువు ఒకేసారి ఎదురుపడితే మొదట గురువుకే నమస్కారం చేస్తానన్నారు గురు కబీర్‌దాస్. అది గురువుల గొప్పతనమని మంత్రి లోకేష్ ఉద్ఘాటించారు.


### నాకు లైఫ్ టైమ్ గురువు చంద్రబాబే

దేశానికి అధినేత అయినా గురువు దగ్గర చదువుకున్న విద్యార్థే. వరల్డ్ రిచ్చెస్ట్ పర్సన్ కూడా ఒక గురువుకు స్టూడెంటే. ఇంజనీర్, డాక్టర్, యాక్టర్, లీడర్, లాయర్... ఎవ్వరైనా ఓ గురువు వద్ద శిష్యుడే. సర్వేపల్లి రాధాకృష్ణన్ తనకు కృష్ణుడితో సమానమైన గురువు అని జాతిపిత మహాత్మా గాంధీ చెప్పారు. బాలికా విద్య కోసం తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే ఎంతగానో కృషి చేసారు. నాకు లైఫ్ టైం గురువు మా నాన్న చంద్రబాబు. మిమ్మల్ని చూస్తుంటే నా టీచర్లు గుర్తొచ్చారు. వాళ్లు చెప్పిన పాఠాలు, కొట్టిన దెబ్బలు ఇంకా నాకు గుర్తున్నాయి. స్కూల్‌లో మాది గోల బ్యాచ్... మేము ఫ్రెండ్స్ ఆఫ్ ఫస్ట్ బెంచర్స్. అంటే మాది లాస్ట్ బెంచ్. కానీ లాస్ట్ బెంచ్ నుండి స్టాన్‌ఫోర్డ్‌కి నా ప్రయాణం ఎలా జరిగిందో మీకు చెబుతాను. స్కూల్‌లో మంజులా మ్యాడం కొట్టిన దెబ్బలు, రమాదేవి మ్యాడం నేర్పిన డిసిప్లిన్ నాకు గుర్తున్నాయి. ఇంటర్‌లో నారాయణ మాస్టారు బ్రిడ్జ్ కోర్సు. కార్నెగీ మెల్లన్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ రాజిరెడ్డి మార్గదర్శకత్వాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను. ప్రపంచంలో ఏ రంగంలో ఉన్నవారైనా, ఎంత గొప్పవారైనా తమ టీచర్లను గౌరవిస్తూ ఉంటారని మంత్రి లోకేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, రాష్ట్ర మానవవనరుల శాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరక్టర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



# తప్పు చేయను.. చేసేవాళ్లను ఉపేక్షించను

- గత పాలనలో నాతో సహా ప్రజలంతా బాధితులే
- గత ప్రభుత్వ ఆరాచకాలకు నేనే మొదటి బాధితుడిని
- ప్రజాస్వామ్యం కోసం పోరాడితే పదుల్లో కేసులు పెట్టారు
- ఇప్పుడిక.. శాంతి భద్రతల విషయంలో రాజీ లేదు
- కూటమి వచ్చాకే మహిళలపై నేరాలు తగ్గుముఖం
- సోషల్ మీడియా ఫేక్ ప్రచారాల కుట్రల్ని ఛేదిస్తాం
- శాసన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన
- శాంతి భద్రతలపై స్వల్పకాలిక చర్చలో సీఎం సమాధానం



అమరావతి (చైతన్య రథం): గత పాలకుల అరాచకానికి ప్రజలతోపాటు తానూ బాధితుడినేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తప్పుడు కేసులతో వేధించడానికి అరెస్టు చేసి జైల్లో పెట్టారనీ... జైల్లో కూడా తన కదలికలు చూడ్డానికి డ్రోన్ ఎగరేశారనీ గుర్తు చేశారు. గురువారం శాసనసభలో శాంతిభద్రతల అంశంపై స్వల్పకాలిక చర్చులో పాల్గొన్న ముఖ్యమంత్రి.. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి –సామాజిక మాధ్యమాల అంశంపై ప్రసంగించారు. "గత ప్రభుత్వహయాంలో ప్రజాస్వామ్యం కోసం పోరాడిన వారందరిపైనా కేసులు పెట్టారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడిపై అత్యాచారయత్నం కేసులు పెట్టారు. ప్రస్తుత స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ గత పాలకులు పెట్టిన కేసుల బాధితులే. నాపై 17 కేసులు పెట్టి వేధించారు. ఇది అరాచకానికి పరాకాష్ట. యువగళం పాదయాత్ర ద్వారా మంత్రి లోకేశ్ ప్రజలను కలిస్తే కేసులు పెట్టారు. అంగళ్లులో నాపై దాడి చేయించి, మళ్లీ నాపైనే కేసులు పెట్టారు. ప్రజలతో మాట్లాడేందుకు సమావేశం ఏర్పాటు చేసుకుంటే కరెంటు తొలగించి వేధించారు. ఇప్పుడు మంత్రులుగా ఉన్న అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, బీసీ జనార్ధన రెడ్డి, సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర, జేసీ ప్రభాకర్ రెడ్డి, పులివర్తి నాని, నిమ్మల రామానాయుడు, దేవినేని ఉమ, బీటెక్ రవి, కూన రవి.. ఇలా నేతలపై కేసులుపెట్టి వేధించారు. రఘురామకృష్ణంరాజును అరెస్టు చేసినప్పుడు ఆయనను ఏం చేస్తారోననే ఆందోళన వెంటాడింది. గత ప్రభుత్వ హయాంలో అందరిపైనా కేసులు, వేధింపులే. అమరావతి రైతులు, మహిళలు రాజధాని కోసం పోరాడుతుంటే బాత్‌రూమ్‌లపై డ్రోన్లు ఎగరేశారు. అమరావతి రైతులు చేపట్టిన న్యాయస్థానంనుంచి దేవస్థానం పాదయాత్రకూ అడుగడుగునా అడ్డంకులు కల్పించారు. గత పాలకుల అరాచకాలు భరించలేక పారిశ్రామికవేత్తలు కూడా రాష్ట్రంనుంచి పారిపోయారు. అప్పటి గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ తన పరిశ్రమను పొరుగు రాష్ట్రానికి తీసుకెళ్లిపోయారు. రాజకీయాల నుంచే తప్పుకున్నారు. చివరకు సింగపూర్ ప్రభుత్వంపైనా అభాండాలు వేసి ప్రాజెక్టునుంచి వైదొలిగేలా చేశారు. 2019–24 వరకూ రాష్ట్రం తీవ్రస్థాయిలో అరాచకాలను భరించింది. గత పాలకులు టీడీపీ కార్యాలయంపైనా దాడికి తెగబడ్డారు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు భయానకమైన చరిత్రను గుర్తు చేశారు.

## మేం కక్షసాధింపు రాజకీయాలు చేయం

"బాధ్యత కలిగిన నాయకుడిని కాబట్టే ప్రజలు నన్ను నాలుగోసారి ఎన్నుకున్నారు. కక్ష సాధింపు రాజకీయాలు చేస్తే అధికారంలోకి వచ్చిన మొదటి రోజునే అరెస్టు చేసి ఉండేవాళ్లం. గతంలో సీఎంగా ఉండగా అలిపిరి వద్ద నక్సల్స్ 23 క్లైమోర్ మైన్లు బ్లాస్ట్ చేశారు. అలాంటి పరిస్థితులనుంచి బయటపడి నిన్న మళ్లీ తిరుమల శ్రీవారికి సీఎంగా 14వసారి పట్టువస్త్రాలు సమర్పించాను. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సమస్యల గురించి నక్సల్స్‌కు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తే.. నాపై క్లైమోర్‌మైన్స్ పేల్చారు. రాష్ట్ర భవిష్యత్ కోసం నా ప్రాణాలు త్యాగం చేయడానికైనా సిద్ధపడ్డాను. రాయలసీమలోనూ కరడుగట్టిన ఫ్యాక్షన్ రాజకీయాలను రూపు మాపాం. టీడీపీ తీసుకున్న విధానాలవల్లే రాయలసీమలో ఇప్పుడు ఫ్యాక్షన్ లేదు. ఉమ్మడి రాష్ట్రంలో మతవిద్వేషాలనూ సమర్థవంతంగా కట్టడి చేశాం. గత పాలకుల హయాంలో ఇబ్బందులు ఎదుర్కొన్న ఎమ్మెల్యేల ఆవేశానికీ అర్థం ఉంది. అయితే వారు ప్రవర్తించిన విధంగానే మనమూ ప్రవర్తించకూడదు. తప్పుచేసిన ఎవరికైనా శిక్ష తథ్యం. చట్టప్రకారం ప్రభుత్వం వ్యవహరిస్తుంది. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేదు. స్వర్ణాంధ్ర–2047 విజన్‌కు అనుగుణంగా ఏపీ ముందుకెళ్లాలి. అగ్రస్థాయి రాష్ట్రంగా ఏపీ ఉండాలి" అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు.

## సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారం కట్టడికి చర్యలు

"సామాజిక మాధ్యమాల్లో ఫేక్ ప్రచారాలు సాగిస్తూ.. ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే కఠినంగా చర్యలు తప్పవు. గత పాలకుల హయాంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి పోలీసు వ్యవస్థను పూర్తిగా భ్రష్టుపట్టించారు. కూటమి అధికారంలోకి వచ్చిన సమయం నుంచీ ఒక్కో వ్యవస్థనూ సరిదిద్దుకుంటూ వస్తున్నాం. నేరస్థులకు అండగా ఉండే రాజకీయాలను నేను ఇంతవరకూ చూడలేదు. రాజకీయ ముసుగులో ఉన్న నేరస్తులను బయటపెట్టాలి. వారి ముసుగు తీస్తే ప్రజలే అర్థం చేసుకుంటారు. నిద్ర లేచినప్పటి నుంచి నిద్ర పోయే వరకూ జాగ్రత్తగా ఉండే నాపై కూడా సామాజిక మాధ్యమాల్లో ఫేక్ పోస్టులు పెడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా పేటియం బ్యాచ్‌లను పెట్టి పెద్దఎత్తున ఫేక్ న్యూస్ ప్రచారం చేయిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారం పోయాక మరోలా ప్రవర్తిస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా తీవ్రస్థాయిలో వేధింపులు చేస్తున్నారు. వ్యక్తుల ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ వ్యవహారంపై క్యాబినెట్ సబ్ కమిటీ వేశాం. ఫేక్ ప్రచారాలు చేసే నేరస్తులు ప్రపంచంలో ఎక్కడున్నా తీసుకువస్తాం. మహిళలపై కించపరిచేలా పోస్టులుపెట్టి వేధింపులకు పాల్పడుతున్నారు. ఈ తరహా నేరాలపై సీరియస్‌గా వ్యవహరిస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు.

## క్రిమినల్స్‌తో కలిసిపోయి ముఖ్యమంత్రికే నోటీసులా?

"వివేకా హత్య తర్వాత క్రైమ్ సీన్‌లో సీఐ శంకరయ్య ఉన్నారు. సీఎంకు నోటీసులు పంపించటమంటే ఎంత ధైర్యం చేసి ఉండాలి. నేరం జరిగినప్పుడు సీన్ ఆఫ్ అఫెన్సులో సీఐగా విధులు నిర్వహించి నేరం జరిగిన ప్రాంతాన్ని రక్షించాలి. కానీ క్రిమినల్స్‌తో కలిసిపోయి ముఖ్యమంత్రికే నోటీసు పంపించేస్థాయికి సీఐ శంకరయ్య చేరుకున్నారు. వివేకా హత్య కేసులో ముఖ్యమంత్రిగా నన్నూ ఏమార్చారు. అక్కడున్న రక్తాన్ని శుభ్రం చేశారు. ఏమీ తెలియని వారిలా అమాయకంగా వచ్చి స్టేట్‌మెంట్ ఇచ్చారు.

చివరకు గుండెపోటు కాదు గొడ్డలి పోటు అని తేలింది. ఫేక్ రాజకీయాలకు ఇది ప్రత్యక్ష ఉదాహరణ. రాజకీయంగా చాలామందిని ఎదుర్కొన్న నేను ఇప్పుడు నేరస్తుల్ని ఎదుర్కోవాల్సి వస్తోంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రౌడీ రాజకీయాలు చెల్లవు

"పొగాకు రైతుల్ని పరామర్శించడానికి వెళ్లి సినిమా డైలాగులు మాట్లాడారు. మహిళలను కించపరిచేలా పోస్టింగులు పెట్టి అవమానించారు. సింగయ్యను కారు కింద తొక్కించేసి తిరిగి బురదజల్లే ప్రయత్నం చేశారు. కనీసం మానవత్వం లేకుండా పొదల్లోకి విసిరేసి వెళ్లిపోయారు. తిరిగి మృతుడి భార్యతో అసత్యాలు చెప్పించారు. తన భర్త జగన్ కారు కిందపడి చనిపోలేదు, పోలీసులు అంబులెన్సులో తీసుకెళ్లి చంపేశారని ప్రకటన చేయించారు. మామిడి రైతులను పరామర్శించడానికి వెళ్లి రోడ్డుపై మామిడికాయలను ట్రాక్టర్లతో తొక్కించారు. రౌడీ రాజకీయాలకు ఇది ప్రత్యక్ష ఉదాహరణ. కూటమి ప్రభుత్వంలో రౌడీ రాజకీయాలు చేయాలంటే కదరదు' అని సీఎం స్పష్టం చేశారు.

## మహిళలపై నేరాలను కట్టడి చేశాం

"మహిళలపై రాష్ట్రంలో నేరాలు తగ్గాయి. గతంతో పోల్చుకుంటే 4.84 శాతంమేర మహిళలపై నేరాలు తగ్గాయి. వరకట్న మరణాలు 43శాతం తగ్గాయి. మహిళా హత్యలు 15శాతం తగ్గాయి. మహిళా ఆత్మహత్యలు 59 శాతం తగ్గాయి. మహిళలపై సైబర్ వేధింపులు 17 శాతం తగ్గాయి. వరకట్న వేధింపులు 25శాతం తగ్గాయి. మహిళలపై నేరాలకు పాల్పడ్డ వారిలో 343 మందికి శిక్షలు పడ్డాయి. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే అదే వారికి చివరి రోజవుతుందని హెచ్చరిస్తున్నాం. మహిళలపై నేరం జరిగితే కేవలం 8–10 నిముషాల్లోపే ఘటనా స్థలికి చేరుకునేలా చర్యలుచేపట్టాం. శక్తి టీమ్‌లను ఏర్పాటుచేసి మహిళల రక్షణపట్ల చర్యలు చేపడుతున్నాం. సెక్సువల్ అఫెండర్లపైనా రౌడీషీట్లను ఓపెన్ చేస్తాం. ఆన్ లైన్‌లోనూ నేరస్తుల ఫోటోలు పెడతాం. రాష్ట్రంలో ఓ ఉద్యమంగా డ్రగ్స్ నియంత్రణ కార్యక్రమాలు చేపడుతున్నాం. ఈగల్ టాస్క్ ఫోర్సు ద్వారా గంజాయి, మాదక ద్రవ్యాలను కట్టడి చేస్తున్నాం. రాష్ట్రంలో గంజాయిని జీరో కల్టివేషన్ స్థాయికి తీసుకువచ్చాం. అయితే పొరుగు రాష్ట్రాలనుంచి కొంతమేర అక్రమంగా రవాణా అవుతోంది. రాష్ట్రంలో సైబర్ ఫ్రాడ్స్ కోట్లలో నష్టపోతున్నారు. బాగా చదువుకున్న వ్యక్తులు కూడా సైబర్ ఫ్రాడ్స్ ఉచ్చులో పడి డబ్బు నష్టపోతున్నారు. సైబర్ క్రైమ్స్, ఫ్రాడ్స్ ఉచ్చులో పడొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను. సైబర్ క్రైమ్ నియంత్రణకు ప్రత్యేకంగా కార్యాచరణ చేపట్టాం. ఫోరెన్సిక్స్‌ను కూడా బలోపేతం చేస్తున్నాం. శాంతిభద్రతల విషయంలో ఎప్పుడూ రాజీ పడలేదు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

## అసెంబ్లీకి డుమ్మా ఎమ్మెల్యేలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం

అమరావతి (చైతన్య రథం): ఆలస్యంగా వచ్చి, అసెంబ్లీ సమావేశాలు పూర్తికాక ముందే వెళ్తున్న ఎమ్మెల్యేలపై ఏపీ సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలక చర్చల సమయంలో సభ్యుల గైర్హాజరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశం ప్రారంభమయ్యే సమయానికి శాసనసభలో 30మంది ఎమ్మెల్యేలున్నారు. వెంటనే అసెంబ్లీలో విప్‌లను చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అప్రమత్తం చేశారు. సీఎం ఆరా తీయడంతో సమావేశానికి డుమ్మాకొట్టిన ఎమ్మెల్యేలకు విప్‌లు ఫోన్లు చేశారు. అప్పటికప్పుడు 17మంది ఎమ్మెల్యేలను పిలిపించారు. పూర్తిస్థాయిలో సభ్యులు హాజరయ్యేలా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.



ఏపీ పర్యటనలో భాగంగా గురువారం తిరుమల వేంకటేశ్వరస్వామిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో కలిసి దర్శనం చేసుకున్న భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్. ఇరువురినీ ఆలయ మర్యాదలతో ఆహ్వానించిన తితిదే.. దర్శనం అనంతరం ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందచేశారు. అనంతరం తిరుమల భక్తుల వసతిసౌకర్యం కోసం నూతనంగా నిర్మించిన పిలిగ్రిమ్స్ అమ్నెటీస్ కాంప్లెక్స్-5ను ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ ప్రారంభించారు. తిరుమల పర్యవేక్షణకు నెలకొల్పిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యామంత్రి నారా లోకేశ్, దేవాదాయ మంత్రి ఆనం, ఎమ్మెల్యేలు, తితిదే ఉన్నతాధికారు పాల్గొన్నారు.



## ఇచ్చిన మాట మేరకు..

# 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు



- మార్పు ఇంటినుంచే మొదలవ్వాలి
- నూతన ఉపాధ్యాయుల ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానాలు

అమరావతి (చైతన్యరథం): యువతకు ఇచ్చిన మాట ప్రకారం అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించి తీరతామని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. మహిళలను గౌరవించటం అనేది ఇంటినుంచే మొదలుకావాలన్నారు. అప్పుడే సమాజంలోనూ మార్పు వస్తుందన్నారు. ఆమరావతిలో గురువారం జరిగిన మెగా డీఎస్సీ విజేతలకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో నూతన ఉపాధ్యాయుల ప్రశ్నలకు మంత్రి లోకేష్ బదులిచ్చారు.

**1) సుమన్ నలుకుర్తి, గుంటూరు**

*నేను స్కూల్ అసిస్టెంట్ విభాగంగా జిల్లా 2వర్యాంకు సాధించాను. ఆంధ్రప్రదేశ్ యువతకు 20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తామని మీరు హామీ ఇచ్చారు. దీన్ని సాధించడానికి మీ వద్ద ఎటువంటి రోడ్ మ్యాప్ ఉంది?*

**నారా లోకేష్:** యువగళం యాత్రలో జీడీ నెల్లూరు నియోజకవర్గంలో ఒక గ్రామానికి వెళ్లాను. మోహన అనే తల్లి అక్కడ బోండాలు వేస్తోంది. ఆ తల్లిని మేం వచ్చాక ప్రభుత్వం నుంచి ఏమి ఆశిస్తున్నారని అడిగాను. భర్త మద్యానికి బానిసై చనిపోయాడు. 30ఏళ్లు కష్టపడి పిల్లలను చదివించా. వారికి ఉద్యోగాలు ఇవ్వండి చాలు అని కోరింది. ఆరోజే యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని నిర్ణయించా. అందుకే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20లక్షలు కల్పిస్తానని హామీ ఇచ్చాను. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి మనవద్ద ఉన్న ఒకే ఒక ఆయుధం విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు. 2 వది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. దీనివల్లే దక్షిణ భారతంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తొలి ఏడాదిలోనే రూ.10లక్షల కోట్లు పెట్టుబడులు సాధించాం. కొత్త రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఆకలి, కసి, పట్టుదలతో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలందరం కలసికట్టుగా పనిచేస్తున్నాం. అహర్నిశలు కష్టపడి ఇచ్చిన మాట ప్రకారం అయిదేళ్లలో యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం.

**2) బోకం అనిత, విశాఖపట్నం.**

*మీరు డీఎస్సీ ప్రకటించడం వల్ల నన్ను నేను ప్రూవ్ చేసుకోగలిగాను. మీరు తరచుగా జెండర్ సెన్సిటివిటీ గురించి మాట్లాడుతున్నారు. జెండర్ సెన్సిటివిటీని పాఠ్యాంశాల్లో చేర్చడానికి ఎలాంటి ప్రయత్నం చేస్తున్నారు? మీ నాయకత్వంలో లింగ సమానత్వం అమలుకు చేపడుతున్న చర్యలు ఏమిటి?*

**నారా లోకేష్:** బ్రహ్మణికి, నాకు చిన్నవయసులో పెండ్లి అయింది. ఇప్పుడే ఆమె హెరిటేజ్ ఎండి అయింది. సమాజంలో మార్పురావాలంటే ముందు మన ఇంట్లో మార్పురావాలని నేను బలంగా నమ్ముతాను. మా తాత నుంచి చంద్రబాబు వరకు చూస్తూ ఇంట్లో మహిళలను గౌరవించడం నేర్చుకున్నా. నేను ఎన్నో దేశాలు, రాష్ట్రాలు తిరిగా. మహిళలకు గౌరవం కేవలం చట్టాలు చేయడంతోనే రాదు, ప్రతిఒక్కరూ వారిని గౌరవించాలి. నేను విద్యామంత్రి అయ్యాక పాఠ్యాంశాల ఫోటోల్లో మార్పులు చేశా. కేజీ నుంచి పీజీ వరకు జెండర్ సెన్సివిటీ క్లాసులు తేవాలి. అమ్మాయిలా ఏడవద్దు, చీరకట్టుకున్నావా అనే పదాలు వాడకూడదు. ప్రజాప్రతినిధులు మహిళలను గౌరవించాలి. అప్పుడే సమాజంలో మార్పు వస్తుంది. రాబోయే నాలుగేళ్లలో కేజీ నుంచి పీజీ వరకు జెండర్ సెన్సిటివిటీ క్లాసులు నిర్వహిస్తాం. సినిమాలు, టీవీ షోల్లో మహిళలను అగౌరవపర్చే డైలాగులు ఉండకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రిని కోరుతున్నా.

# తిరుమలలో మంత్రి లోకేష్

**- ఉపరాష్ట్రపతి, సీఎంతో కలిసి వేంకటాద్రి నిలయం వసతి సముదాయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి**





తిరుమల (చైతన్యరథం): విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ గురువారం తిరుమలలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి వేంకటాద్రి నిలయం వసతి సముదాయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీవారి భక్తుల కోసం నూతనంగా నిర్మించిన వేంకటాద్రి నిలయం యాత్రికుల వసతి సముదాయం (పీఏసీ-5)తో పాటు శ్రీవారి ప్రసాదమ్స్ ఇన్‌గ్రెడియంట్స్- విజన్ బేస్డ్ స్టోరింగ్ మెషిన్ (లడ్డూ నాణ్యత యంత్రం)ను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబునాయుడు లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా భవనం ప్రాంగణానికి చేరుకున్న రాధాకృష్ణన్, చంద్రబాబునాయుడికి మంగళవాయిద్యాలతో అధికారులు ఘనస్వాగతం పలికారు. తొలుత శ్రీవేంకటేశ్వరస్వామికి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి వేంకటాద్రి నిలయం(పీఏసీ-5)ను లాంఛనంగా ప్రారంభించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవనం మొత్తం కలియతిరిగి భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.వసతి గృహం బుకింగ్ కౌంటర్‌ను ఉపరాష్ట్రపతితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తదితరులు పాల్గొన్నారు.

**సీఎం చంద్రబాబుతో కలిసి..**

అనంతరం సీఎం చంద్రబాబుతో కలిసి తిరుమల వైకుంఠం క్యూకాంప్లెక్స్-1 లో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ) ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సీఎం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు బుధవారం రాత్రి శ్రీవారిని దర్శించుకున్న అనంతరం పద్మావతి అతిథి గృహంలో సీఎం చంద్రబాబుతో కలిసి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.





# భక్తుల సౌకర్యమే లక్ష్యంగా..

- తిరుమలలో అందుబాటులోకి నూతన వసతి సముదాయం
- రద్దీ, క్యూలైన్ల పర్యవేక్షణకు సమీకృత కమాండ్ కంట్రోల్ సెంటర్
- ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో కలిసి ప్రారంభించిన సీఎం చంద్రబాబు






తిరుమల (చైతన్య రథం): శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు నూతన వసతి సముదాయం అందుబాటులోకి వచ్చింది. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు భక్తుల కోసం నిర్మించిన నూతన వసతి సముదాయం వేంకటాద్రి నిలయాన్ని ప్రారంభించారు. ఈ పిలిగ్రిమ్స్ అమెనిటీస్ కాంప్లెక్సు-5ను రూ.102 కోట్ల వ్యయంతో తితదే నిర్మించింది. ఎలాంటి ముందస్తు బుకింగ్ లేకుండా తిరుమల వచ్చిన భక్తులకు వసతి కల్పించేందుకు నూతన వసతి సముదాయాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఒకేసారి 4 వేలమంది భక్తులకు ఉచిత వసతి సౌకర్యం కల్పించేలా దీన్ని సిద్ధం చేశారు. 16 డార్మిటరీలు, 2400 లాకర్లు, 24 గంటలూ వేడినీటి సదుపాయం తదితర సౌకర్యాలతో ఈ పిలిగ్రిమ్స్ అమెనిటీస్ సెంటర్-5ను తీర్చిదిద్దారు. ఒకేసారి 80మంది భక్తులు తలనీలాలు సమర్పించుకునేందుకు వీలుగా కల్యాణ కట్టను కూడా ఈ పీఏసీ-5 ప్రాంగణంలో టీటీడీ ఏర్పాటు చేసింది. ఒకేసారి 1400మంది భక్తులు భోజనం చేసేందుకు వీలుగా ఈ కాంప్లెక్సులో రెండు భారీ డైనింగ్ హాళ్లనూ అందుబాటులో ఉంచారు. ఈ వసతి సముదాయాన్ని ప్రారంభించిన అనంతరం ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో కలిసి సీఎం చంద్రబాబు భవనాన్ని పరిశీలించారు. వసతి గృహం బుకింగ్ కౌంటర్లోకి వెళ్లిన సీఎం, ఉప రాష్ట్రపతి.. బుకింగ్ జరుగుతున్న విధానాన్ని తెలుసుకున్నారు. ఓ భక్తురాలికి తొలి వసతి బుకింగ్ టోకెన్‌ను సీఎం చంద్రబాబు అందించారు. ఈ ప్రాంగణంలోనే ఏర్పాటు చేసిన వేస్ట్ కలెక్షన్ యంత్రాన్ని ఉప రాష్ట్రపతి, ముఖ్యమంత్రి ఆసక్తిగా పరిశీలించారు. తిరుమల పోటులో ప్రసాదం తయారీ కోసం వినియోగించేందుకు ఏఐ ఆధారిత సాంకేతికతతో అందుబాటులోకి తెచ్చిన కొత్త సార్టింగ్ యంత్రాలనూ ప్రారంభించారు. ఈ యంత్రాల సాయంతో ప్రసాదంలో నాణ్యత పెంచడంతోపాటు... తక్కువ సమయంలో ఎక్కువ ప్రసాదాన్ని సిద్ధం చేసే అవకాశం కలుగుతుందని అధికారులు వివరించారు.

## టెక్నాలజీతో క్యూలైన్ల నిర్వహణకు ఐసీసీ సెంటర్

శ్రీవారి దర్శనం కోసం భక్తులు వేచివుండే సమయాన్ని తగ్గించేలా అత్యుత్తమ విధానాన్ని అనుసరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. వైకుంఠం క్యూకాంప్లెక్సులో నూతనంగా నిర్మించిన అధునాతన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సీఎం ప్రారంభించారు. ప్రస్తుతం గంటకు 4500 మంది భక్తులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్నారని అధికారులు సీఎంకు వివరించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం రెడీ అనలటిక్స్, మెషీన్ లెర్నింగ్ సాయంతో వేంకటేశ్వరుని దర్శనం కోసం నిరీక్షణలో ఎంతమంది భక్తులున్నారో గుర్తించి అందుకు అనుగుణంగా క్యూలైన్ నిర్వహణ చేపడతామని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం... గంటకు 5500 మంది వరకూ భక్తులు శ్రీవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే భక్తులు వేచి ఉండే క్యూ కాంప్లెక్సులు, కంపార్టమెంట్లల్లో భక్తి భావన పెంపొందించేలా ఆధ్యాత్మిక వీడియోలను, శ్రీవారి చరిత్రను ప్రదర్శించాలని ఆదేశించారు. తిరుమల కొండపైకి నిషేధిత వస్తువులు తీసుకురాకుండా అలిపిరి వద్దే నిలువరించేలా ఈ కమాండ్ కంట్రోల్ కేంద్రంనుంచే టెక్నాలజీ సాయంతో పర్యవేక్షించాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానించిన సీసీ కెమెరాల సాయంతో అలిపిరినుంచే రద్దీ హీట్ మ్యాపులను గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. దీంతోపాటు టీటీడీ నిర్వహణలోని అన్ని దేవాలయాలనూ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తిరుమల కొండను అత్యంత పరిశుభ్రంగా ఉంచడంతోపాటు.. సుందరంగా కన్పించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఈమేరకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌నుంచి పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలన్నారు. తిరుమల గిరుల్లో ఎక్కడైనా అపరిశుభ్ర వాతావరణం కన్పిస్తే వెంటనే అలెర్ట్ చేసి... ఆ చెత్తను తొలగించేలా చూడాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇక గ్రీనరీకి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఏడుకొండలపై 90 శాతానికి పైగా గ్రీనరీ ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యేలు, టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.












చైతన్యరథం




# మెగా డీఎస్సీ బంపర్ హిట్

అమరావతి (చైతన్య రథం): మెగా డీఎస్సీ పండుగ బంపర్ హిట్టయ్యింది. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన తొలి సంతకం వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపింది. ఒక్క సంతకంతో 15,941 మంది డీఎస్సీ ద్వారా టీచర్లుగా ఉద్యోగ నియామకాలు పొందారు. వీరికి ఉద్యోగ నియామక పత్రాలను అందించేందుకు నిర్వహించిన మెగా డీఎస్సీ ఉత్సవ్ ఆద్యంతం అద్భుతంగా సాగింది. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ చేపట్టిన కార్యక్రమాలన్నీ ఒక ఎత్తయితే.. మెగా డీఎస్సీ ఉత్సవ్ కార్యక్రమం మరో ఎత్తు అన్నట్టు సాగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా వారికి నియామక ఉత్తర్వుల అందజేతతో మేనిఫెస్టోలోని మొదటి సంతకం హామీ పరిపూర్ణమైంది. కోర్టు కేసులలాంటి అనేక సవాళ్లను, కుట్రలను దాటుకుని డీఎస్సీ కార్యక్రమాన్ని విద్యా శాఖ నిర్వహించింది. మొత్తం 15,941 పోస్టుల భర్తీతో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాలు పొందినవారితో అమరావతిలో నిర్వహించిన మెగా డీఎస్సీ ఉత్సవ్ బంపర్ హిట్టయ్యింది. కుటుంబసభ్యులతో కలిసి నియామక ఉత్తర్వులు అందుకునే కార్యక్రమంలో మెగా డీఎస్సీ విజేతలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకూ..**

డీఎస్సీ నోటిఫికేషన్‌నుంచి టీచర్లకు నియామక ఉత్తర్వులు అందజేసే కార్యక్రమం వరకూ విద్యా మంత్రి నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మెగా డీఎస్సీలో నియామకాలు పొందిన టీచర్లకు పత్రాలు అందించేందుకు విద్యాశాఖ వినూత్నంగా, ఆసక్తికరంగా కార్యక్రమాన్ని నిర్వహించింది. సభలోకి నేతల ఎంట్రీనుంచే అదుర్స్ అనిపించే రీతిలో సభ సాగింది. సభా ప్రాంగణంలో నలువైపులా ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై చంద్రబాబు, లోకేష్, బీజేపీ అధ్యక్షుడు మాధవ్ అభివాదం చేసుకుంటూ వెళ్లారు.

- పరిపూర్ణమైన సీఎం చంద్రబాబు తొలి సంతకం హామీ
- ఒక్క సంతకంతో 15,941మంది జీవితాల్లో వెలుగులు
- ఆద్యంతం వినూత్నంగా సాగిన మెగా డీఎస్సీ ఉత్సవ్



ఈ సందర్భంగా అభ్యర్థులు సీఎం, మంత్రి నారా లోకేష్‌లకు కరచాలనం ఇచ్చేందుకు ఆసక్తి చూపారు. ఇక రొటీన్ సభ మాదిరిగా కాకుండా... ముఖాముఖి తరహాలో నిర్వహించారు. కొత్తగా నియమితులైన టీచర్లు ముఖ్యమంత్రి, విద్యా మంత్రి, బీజేపీ అధ్యక్షుడిని కొన్ని ప్రశ్నలు వేశారు. వాటికి నేతలు ముగ్గురు ఆసక్తికరమైన సమాధానాలు ఇచ్చారు. సభ ప్రారంభంలో యువగళం పాట వేయడంపై మంత్రి లోకేష్ సభికులకు క్షమాపణ చెప్పడం. అందర్నీ ఆశ్చర్యపరిచింది. మెగా డీఎస్సీ ఉత్సవ్‌లో టీచర్ ఉద్యోగాలు సాధించిన వారి కష్టాలు, వారి నేపథ్యాలను ప్రత్యేకంగా వివరించేలా కార్యక్రమంలో వీడియోలను ప్రదర్శించారు. నిరుపేద, దిగువ మధ్య తరగతికి చెందిన యువత ఒక్కొక్కరు తమ కలల్ని ఎలా నిజం చేసుకున్నారనే అంశాన్ని వివరించేలా, స్ఫూర్తిని నింపేలా వీడియోలను కార్యక్రమంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆ వీడియోలు చూసి పలువురు కంటతడి పెట్టారు.

**విద్యాశాఖకు సీఎం ప్రశంసలు**

మెగా డీఎస్సీ మెగా హిట్ కావడంపై విద్యా మంత్రి నారా లోకేష్‌తో పాటు ఆ శాఖ అధికారులను సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. టీచర్ల కరతాళ ధ్వనుల మధ్య భుజంతట్టి మంత్రి లోకేష్‌ను వేదికపైనే అభినందించారు. మెగా డీఎస్సీ ప్రక్రియ ఆరంభంనుంచి నియామకాల వరకూ అధికారులు పడిన శ్రమను ప్రత్యేకంగా వేదికపైనే ప్రస్తావించిన మంత్రి లోకేష్.. విద్యాశాఖ ఉన్నతాధికారులను అభినందించారు. ఈ తరహాలో ఉన్నతాధికారులను సభలో అభినందించడం తొలిసారి అనే చర్చ జరిగింది. ఉద్యోగాలు కల్పించి తమ జీవితాలను నిలబెట్టిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో సెల్ఫీలు దిగేందుకు టీచర్లు పెద్దఎత్తున ఆసక్తి చూపారు. థ్యాంక్యూ సీఎం సర్ అంటూ ప్లకార్డులతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీ ఉత్సవ్‌కు హాజరైన మంత్రులు ఎమ్మెల్యేలు తమతమ జిల్లాలకు చెందిన టీచర్లతో కూర్చుని వారి సంతోషంలో భాగమయ్యారు.










చైతన్యరథం

# అసెంబ్లీ ప్రాంగణంలో అనెక్స్ భవనం

## ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు - పాల్గొన్న మంత్రులు నారాయణ, పయ్యావుల




అమరావతి (చైతన్యరథం): అసెంబ్లీ ప్రాంగణంలో నిర్మించిన అనెక్స్ భవనాన్ని గురువారం స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు మంత్రులు పయ్యావుల కేశవ్, పి.నారాయణలతో కలిసి ప్రారంభించారు. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో స్పీకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ఈ భవనాన్ని అన్ని హంగులతో పునరుద్ధరించేందుకు సుమారు రూ.5 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేయగా ఈ-టెండరింగ్ విధా నం ద్వారా కేవలం రూ.3.57 కోట్లకే నిర్మించడం జరిగిందని తెలిపారు. ఈ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో మీడియా సమావేశాలకు వీలుగా సుమారు 100 మంది మీడియా ప్రతినిధులు కూర్చునే విధంగా మీడియా హాల్, ఈ హాల్‌ను ఆనుకుని డైనింగ్ హాల్, కిచెన్ నిర్మించామన్నారు. అదేవిధంగా మొదటి అంతస్తులో ప్రభుత్వ చీఫ్ విప్ సహా 16 మంది ప్రభుత్వ విప్‌ల చాంబర్లను, ఒక వెయిటింగ్ హాలును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ భవనంలో నిర్మాణాలను సకాలం లో కల్పించేందుకు రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, మంత్రి పయ్యావుల కేశవ్ ఎంతో సహకరించారని, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్, సీఆర్ డీఏ అధికారులు నిరంతరం పర్యవేక్షించారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ తక్కువ వ్యయం లోనే ఆధునిక సౌకర్యాలతో భవనం నిర్మించడం జరిగింద న్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఏ అంశంలోనూ వృథా చేయకూడదనే లక్ష్యంతో ఈ భవనాన్ని పారదర్శకంగా నిర్మించడం జరిగింద న్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విఫ్ జి.వి.ఆంజనే యులు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్, ప్రభుత్వ విప్‌లు దాట్ల సుబ్బరాజు, రెడ్డప్పగారి మాధవి, కాలవ శ్రీనివాసులు, బెందాళం అశోక్, శ్రీనివాస్, తంగిరాల సౌమ్య, పీజీవీఆర్ నాయుడు, యార్లగడ్డ వెంకట్రావు, థామస్, అరవ శ్రీధర్, తోట జగదీశ్వరి పాల్గొన్నారు.

# ఈ ప్రొక్యూర్‌మెంట్‌తో విద్యుత్ పరికరాలు

- రూ.5 కోట్లు దాటితే ఏపీఈఆర్సీ అనుమతులు
- ఎనర్జీ ఎఫిషియన్సీ కోసం 5 స్టార్ ట్రాన్స్‌ఫార్మర్స్
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అమరావతి (చైతన్యరథం): ఈ-ప్రొక్యూర్‌మెంట్, కాంపిటిటి వ్ బిడ్డింగ్ ద్వారానే విద్యుత్ పరికరాలను కొనుగోలు చేస్తు న్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. విద్యుత్ పరికరాల కొనుగోళ్లు, కాస్ట్ డేటాపై ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, పేరా బత్తుల రాజశేఖరం శాసన మండలిలో అడిగిన ప్రశ్నలకు మంత్రి సమధానం ఇచ్చారు. విద్యుత్ శాఖ కొనుగోళ్లన్నీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్సీ) నిబంధనలకు లోబడే చేస్తున్నామన్నారు. రూ.5 కోట్లకు పైబడిన కొనుగోళ్లకు ఎలక్ట్రిసి టీ రెగ్యులేటరీ కమిషన్ అనుమతులను తప్పకుండా తీసుకుం టున్నామని వెల్లడించారు. అదేవిధంగా విద్యుత్ పరికరాల కొనుగోళ్లలో నాణ్యతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. విద్యుత్ స్తంభాలు, టవర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలుకు సంబంధించి డిస్కం నుంచి డిస్కంకు స్వల్ప ధర వ్యత్యాసం మాత్రమే ఉంటుందన్నారు. రవాణ సదుపాయాలు, ప్రాంతాల మధ్య దూరం కూడా దీనికి కారణమని తెలిపారు. ఈ వ్యత్యాసా న్ని కూడా సాధ్యమైనంత తగ్గిస్తామని మంత్రి చెప్పారు.

రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక, ప్రజా అవసరాలకు 5 స్టార్ రేటింగ్ ట్రాన్స్‌ఫార్మర్లను వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. సింగిల్, డబుల్ స్టార్ ట్రాన్స్‌ఫార్మర్లను వినియోగిస్తే ఎనర్జీ ఎఫిషియన్సీ తగ్గడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్ కూడా ఎక్కువగా ఉంటున్నాయని స్పష్టం చేశారు. రూ.20 నుంచి రూ.30 వేల కోసం చూసుకుంటే విద్యుత్ వినియోగం పెరిగి డిస్కంలపై కూడా భారం పడుతుందని తెలిపారు. జగన్ కాలనీల కోసం రూ.220 కోట్లతో కొనుగోలు చేసిన విద్యుత్ పరికరాలు నిరుప యోగంగా ఉన్నాయని, వాటి వల్ల ఉపయోగం కూడా లేదని చెబుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగల పాలవ్వకుండా స్టోర్స్‌లో భద్రపరిచామని చెప్పారు. వాటిని అవ సరమైన చోట వినియోగించుకుంటున్నామని తెలిపారు.

# కడప వైసీపీ నేత అక్రమాలు

- భూమిని అక్రమంగా రాయించుకున్నారు
- ఫిర్యాదు చేసినందుకు తండ్రిని చంపించారు
- దేవునిపాక వైసీపీ సర్పంచ్ భూ దందా..
- ప్రజావినతుల్లో బాధితుల ఫిర్యాదు



మంగళగిరి (చైతన్యరథం): వైఎస్ఆర్ జిల్లా కొండాపురం మండలం పి.అనంతపురం గ్రామానికి చెందిన ప్రశాంత్‌రెడ్డి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో వైసీపీ నేత దందాపై ఫిర్యాదు చేశారు. తమ గ్రామంలోని సర్వే నెం.187లో 11 ఎకరాల భూమి ఉంది. అయితే అదే గ్రామానికి చెందిన కొయ్యగూర రమేష్‌రెడ్డి అక్రమ పద్ధతిలో కొంత భూమిని రాయించుకుని తమ భూమిలో కూడా వాటా ఉందని పదే పదే గొడవలు పడుతుండేవాడు. 2019 జనవరి 31న రమేష్‌రెడ్డి తన అనుచరులతో కలిసి తన తండ్రిపై దాడి చేయించగా తీవ్రగాయాలయ్యాయి. ఆ సమయం లో కూడా ఇంకోసారి అడ్డం వస్తే ప్రాణాలు తీస్తామని బెదిరిం చారు. తర్వాత వైసీపీ ప్రభుత్వ కాలంలో రమేష్‌రెడ్డి తన అనుచ రులతో కలిసి అక్రమ ఇసుక రవాణా చేయడమే కాకుండా గండికోట ప్రాజెక్ట్ పునరావాసంలో 270 మంది బోగస్ పేర్లు చేర్చారని తన తండ్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విష యంపై కక్ష పెంచుకున్న రమేష్‌రెడ్డి, అతని అనుచరులు 2020 నవంబర్ 13న తన తండ్రిని నిర్దాక్షిణ్యంగా హత్య చేశారు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని ఏపీ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబుకి అర్జీ ఇచ్చారు.

### భూమిని ఆక్రమించారు

విజయనగరం జిల్లా గుర్ల మండలం దేవునిపాక గ్రామానికి చెందిన సభుకు లక్ష్మణ్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలోని సర్వే నెం.3లో 10 ఎకరాల డి-పట్టా భూమి ని గత సుమారు 30 సంవత్సరాలుగా సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నాను. సదరు భూమిలో తహసీల్దార్ సర్వే చేయించి ఆ 10 ఎకరాల భూమిలో తనకు 4 ఎకరాల హక్కు వచ్చేలా పట్టా మంజూరు చేస్తామన్నారు. కానీ సదరు భూమిని తమ ఊరి వైసీపీ సర్పంచ్ పూనపెంట చంటిరాజు, వైసీపీ కార్యకర్తలు ములగపు రవన్న, మంచెల రాము ఆక్రమించి పట్టా రానివ్వ కుండా వేరే వ్యక్తులకు రూ.30 లక్షలకు అమ్ముకుని తమను సాగు చేయకుండా అడ్డుపడుతు న్నారు. దీనిపై ప్రశ్నిస్తే తమ కుటుంబంలో 50 ఓట్లు ఉన్నాయి. మీరు వైసీపీకి ఓటు వేయ లేదు..భూమిపై మీకు ఎలాంటి హక్కులేదని బెదిరిస్తు న్నారు. వారిపై చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలని కోరాడు.

### ప్రభుత్వ భూమిగా నమోదు చేశారు

కర్నూలు జిల్లా కొడుమూరు మండలం కల్లపారి గ్రామానికి చెందిన కరుణాకర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం.654లో 68 సెంట్లు భూమి ఉంది. గత ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వేలో తమ భూమిని ప్రభుత్వ భూమిగా నమోదు చేయడం జరిగింది. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కావునా అధికారులతో మరల సర్వే చేయించి తమ భూమిని ప్రభుత్వ జాబితా నుంచి తొలగించి తమ పేరుపై వచ్చేలా చర్య లు తీసుకోవాలని కోరాడు.

### రీసర్వేలో భూమి తక్కువగా చూపారు

కర్నూలు జిల్లా కొడుమూరు మండలం వర్కురు గ్రామానికి చెందిన శంకరమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గోనెగండ్ల మండలం తిప్పనూరు గ్రామ పరిధిలో సర్వే నెం. 55/1లో 3 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి తమ పేరుపై 1.50 సెంట్లు, ఉరుకుందమ్మ పేరుపై 1.50 సెంట్లు కొనుగోలు చేశాం. గత ప్రభుత్వంలో రీ సర్వే పొరపాట్ల కారణంగా తమ పేరుపై 0.67 సెంట్లు, ఉరుకుందమ్మ పేరుపై 1.20 సెంట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. తమ భూమి మొత్తాన్ని తమపేరుపై ఆన్‌లైన్ నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.

# జీఎస్టీ 2.0పై నెలరోజుల ప్రచారం

- ప్రజల్లో అవగాహన కల్పించాలి
- సీఎస్ విజయానంద్ ఆదేశం



అమరావతి(చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వస్తు సేవల పన్ను తగ్గింపు జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు నెలరోజుల పాటు దసరా నుంచి దీపావళి వరకూ ప్రత్యేక ప్రచార అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడిం చారు. జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై కార్యదర్శులకు అవగాహన కల్పించేందుకు గురువారం రాష్ట్ర సచివాలయంలో సెన్సిటైజేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ వివిధ శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులు వారి వారి శాఖలకు సంబంధించి క్షేత్రస్థాయి వరకూ ఈ కార్యక్రమాన్ని తీసుకువెళ్లి విజయవంతంగా నిర్వహించేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించి వారికి అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. జీఎస్టీ 2.0 వల్ల రాష్ట్రా నికి 8 వేల కోట్ల నష్టం వాటిల్లుతున్నప్పటికీ ప్రజలకు ఆ మేరకు లబ్ధి చేకూరుతున్న నేపథ్యంలో ప్రభుత్వం దీనిని స్వాగతించడం జరిగిందని వెల్లడించారు. జీఎస్టీ 2.0 ద్వారా ఏ విధంగా లబ్ధి కలుగుతుందనే దానిపై ప్రజలకు విస్తృతంగా తెలియజేసి వారిలో పూర్తి అవగాహన కల్పించేందుకు నెలరోజుల పాటు అనగా దీపావళి ముందు రోజైన అక్టోబరు 19 వరకూ ఈ ప్రచార కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామా లు, పట్టణాలు, మండల, అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో వివిధ అవగాహనా కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు. ఇందుకు సంబంధించి గురువారం జీవోను జారీ చేయడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్సెస్‌బాబు జీఎస్టీ 2.0పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ నెలరోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 65 వేల ఈవెంట్లను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం పర్యవేక్షణకు జీఎస్టీ చాంపియన్స్ పేరిట జిల్లాస్థాయిలో జేసీ నోడల్ అధికారిగా, జిల్లా జీఎస్టీ చాంపియన్‌గా, సంబంధిత శాఖల జిల్లా అధికారి వారి శాఖ, అసెంబ్లీ నియోజవర్గస్థాయిలో ప్రత్యేక అధికారి, మండల స్థాయిలో ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, గ్రామ వార్డు సచివాల యాల స్థాయిలో పంచాయతీ, వార్డు అడ్మిన్ కార్యదర్శి ఉంటారని చీఫ్ కమిషనర్ బాబు తెలిపారు. అంతేగాక ఈ నెలరోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ప్లాట్ ఫారమ్‌లు, హోర్డింగ్లు,ఇతర ఔట్ డోర్ ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, జీఏడీ ముఖ్య కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా, ఆర్థిక, ప్రణాళికా శాఖల ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్, ఐటి శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, ఆర్టీజీఎస్ సీఈవో, ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్ ప్రఖర్ జైన్, జీఎస్టీ స్పెషల్ కమిషనర్ సౌమ్య, కమిషనర్లు రవి శంకర్, రమేశ్, అదనపు కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వర్చువల్‌గా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఆర్పి సిసోడియా, బి.రాజశేఖర్, ఎంటి.కృష్ణబాబు, ముఖ్య కార్యద ర్శులు శశిభూషణ్‌కుమార్, ఎస్.సురేశ్‌కుమార్, సీసీఎల్ఏ జి.జ యలక్ష్మి, పలువురు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో తగ్గిన నేరాలు

- గత ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు శూన్యం
- గతంలో స్కూల్ పిల్లలకూ గంజాయి పంపిణీ చేసే దుస్థితి
- సీఎం కఠినంగా వ్యవహరించడంతో పరిస్థితి అదుపులోకి
- ఈగల్ విభాగం ద్వారా గంజాయిని కట్టడి చేశాం
- రాజకీయ ముసుగులో ఉన్న నేరగాళ్లు సోషల్ మీడియాలో రెచ్చిపోతున్నారు
- శాసనసభలో హోం మంత్రి అనిత

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శాసన సభలో గురువారం మాట్లాడిన ఆమె.. గత ప్రభుత్వ హయాంలో అసలు శాంతిభద్రతలనేవి లేవని, మద్యం ధరల భయంతో యువత గంజాయి వైపు మొగ్గు చూపిన దుస్థితిని గుర్తుచేశారు. అప్పట్లో స్కూల్ పిల్లలకూ గంజాయి పంపిణీ చేసే దుస్థితి ఉండేదని, సీఎం చంద్రబాబు నాయుడు కఠినంగా వ్యవహరించ డంతో పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చిందన్నారు. గంజాయి మాఫియాను అరికట్టేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఈగల్' విభాగం ద్వారా 40 వేలకు పైగా ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు.

**నేరాల శాతం తగ్గుదల**

జాతీయ స్థాయిలో వచ్చిన నివేదికల ప్రకారం రాష్ట్రంలో నేరాలు 60 శాతం మేరకు తగ్గాయని మంత్రి తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా 'శక్తి' మొబైల్ యాప్‌ను తీసుకువచ్చాం. అలాగే న్యాయవ్యవస్థను పటిష్టం చేయడం వల్ల కేసుల్లో నిందితులకు శిక్షలు పడుతున్నాయని చెప్పారు.

**ఫోరెన్సిక్ వ్యవస్థ పునరుద్ధరణ**

గత పాలనలో ఫోరెన్సిక్ ప్రయోగశాల నిర్మాణాన్ని నిలిపివేశారు. మేము ప్రభుత్వంలోకి వచ్చేసరికి 25 వేల ఫోరెన్సిక్ నివేదికలు పెండింగ్‌లో ఉండగా, వాటిని 1600కు తగ్గించాం. ఇది తమ నిబద్ధతకు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు.

**సోషల్ మీడియా ముప్పు పై ఆందోళన**

రాజకీయ ముసుగులో ఉన్న నేరగాళ్లు సోషల్ మీడియాలో రెచ్చిపోతున్నారని, వారి ఉన్మాదం పరిశ్రమల అభివృద్ధికే అడ్డంకిగా మారిందన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం పట్ల విద్వేష ప్రచారం జరుగుతోందని, కొందరు కులాల పేర్లు మార్చుకుని అసభ్య పోస్టులు పెడుతున్నారని తెలిపారు. డీప్ ఫేక్ ద్వారా సీఎం వ్యాఖ్యలను వక్రీకరిస్తూ తప్పుడు వీడియోలు చేసి వదులుతున్నారు. పవన్ కళ్యాణ్ కుమార్తె పైనా అసభ్యంగా మాట్లాడటం దారుణం. కేసులు పెడితే మమ్మల్ని ఇష్టారాజ్యంగా తిడుతున్నారు. రప్పా రప్పా నరుకుతాం అని బోర్డులు పెట్టిన వారిపై కేసులు పెట్టొద్దంటే ఎలా? తనతో పాటు గెలిచిన ఎమ్మెల్యేలను కూడా సభకు రాకుండా జగన్ అడ్డుకున్నారు. జగన్ విడుదల చేసిన డిజిటల్ బుక్‌లో ఫిర్యాదు కోసం తెలంగాణ నంబర్ ఇచ్చారు. కర్ణాటకలో ఉన్న వ్యక్తి తెలంగాణ నంబర్ ఇచ్చి ఏపీ ప్రజలను ఫిర్యాదు చేయాలని చెబుతున్నారు. ఫిర్యాదు కోసం ఇచ్చిన నంబర్లు మొత్తం కలిపితే 11 వస్తుంది.. దేవుని స్క్రిప్ట్ అంటే ఇదే అంటూ హోంమంత్రి అనిత ఎత్తిపొడిచారు. ఈ తరహా సోషల్ మీడియా నేరాలను అరికట్టేందుకు చట్టాల్లో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని హోం మంత్రి హితవు పలికారు. ఆర్థిక నేరాలు, డిజిటల్ నేరాల నియంత్రణకు మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రం లో శాంతిభద్రతలు కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హోంమంత్రి స్పష్టం చేశారు.

# ఎన్నో ఏళ్ల కల సాకారం

- మెగా డీఎస్సీ విజేతలకు ఉప ముఖ్యమంత్రి పవన్ శుభాకాంక్షలు
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆకాంక్ష
- ఆరోగ్యం బాగాలేక నియామక పత్రాల ప్రదానం కార్యక్రమానికి రాలేదని వెల్లడి



అమరావతి (చైతన్యరథం): మెగా డీఎస్సీ – 2025 ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారందరికీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఆరోగ్యం సహకరించని దృష్ట్యా డీఎస్సీ నియామక పత్రాల ప్రదానం కార్యక్రమానికి తాను స్వయంగా హాజరు కాలేకపోయానని తెలుపుతూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగార్థులు ఎన్నో ఏళ్ళు డీఎస్సీ కోసం నిరీక్షించారు. ఏక కాలంలో 15,941 మంది ఉపాధ్యాయులను నియమించిన ఈ శుభ సమయం రాష్ట్ర విద్యారంగంలో చిరస్థాయిగా మిగిలిపోతుంది. ఎన్నికల్లో యువతకు ఇచ్చిన మాటకు కట్టుబడి మెగా డీఎస్సీ ద్వారా వారికి దారి చూపిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డీఎస్సీ నియామకాలపై తొలి సంతకం చేశారు. ముఖ్యమంత్రి మార్గదర్శకంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, సోదరుడు నారా లోకేష్ ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియను విజయవంతంగా ముందుకు తీసుకువెళ్ళారు. ఈ ప్రక్రియలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నాను. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను తీర్చిదిద్ది వారి భవితకు బాటలు వేసే బృహత్తర బాధ్యత ఈ రోజు నియామక పత్రాలు అందుకుంటున్న ఉపాధ్యాయులపై ఉంది. ఆ దిశగా విధులు నిర్వర్తించాలని పవన్ ఆకాంక్షించారు.

# ప్రజల పట్ల బాధ్యతలేని జగన్

**- స్పీకర్ అయ్యన్నపాత్రుడు**



అమరావతి (చైతన్యరథం): వైసీపీ నేత జగన్.. ప్రజల పట్ల బాధ్యత లేకుండా వ్యవహరిస్తూ ప్రతిపక్ష హోదా అడుగుతున్నారని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో గురువారం రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై చర్చ సందర్భంగా స్పీకర్ మాట్లాడారు. వైసీపీ నేతలు ఇటీవల మాట్లాడుతున్న 'రప్పా రప్పా' డైలాగులపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఎన్టీఆర్ హయాం నుంచి తాము రాజకీయాల్లో ఉన్నామని.. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదని స్పీకర్ అన్నారు. వైసీపీ సభ్యులు సభకు రాకుండానే ప్రశ్నలు పంపించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తగిన సంఖ్యాబలం లేకున్నా జగన్ ప్రతిపక్ష హోదా అడగటమేంటని ప్రశ్నించారు.

# విజయవాడ ఉత్సవ్‌తో పర్యాటకానికి కొత్త ఊపు

**- ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ ఉత్సవ్‌లాంటి కార్యక్ర మాలు పర్యాటక రంగానికి కొత్త ఊపును తీసుకొస్తాయని ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ అన్నారు. గురువారం మధ్యాహ్నం పున్నమి ఘాట్‌ను టూరిజం సిబ్బందితో కలిసి ఆయన సందర్శించారు. యాత్రికులు, పర్యాటకుల కోసం మంచి ఏర్పాట్లు చేసిన ఉత్సవ్ మేనేజ్‌మెంట్‌ను అభినందించారు. ఈ రకమైన కార్యక్రమాలు విజయవాడలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్ మొత్తంలో పర్యాటకుల రాకను మరింత ప్రోత్సహిస్తాయి. పర్యాటక రంగం అభివృద్ధికి, రాష్ట్రంలోని ముఖ్యమైన పర్యాటక ప్రదేశాలను ప్రపంచానికి పరిచయం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. పున్నమి ఘాట్ వద్ద పర్యాటకుల కోసం చేసిన ఏర్పాట్లు, శుభ్రత, సదుపాయాలు, పర్యాటకులకు అందించిన సేవలను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలు విజయవాడ నగరానికి, రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెస్తాయన్నారు.

# మున్సిపల్ చట్ట సవరణకు ఐదు బిల్లులు

*వేరువేరుగా అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మంత్రి నారాయణ: ఐదింటినీ ఆమోదించిన సభ*



అమరావతి (చైతన్యరథం): మున్సిపల్ శాఖకు సంబంధించిన 5 బిల్లులను గురువారం మంత్రి నారాయణ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టాల సవరణకు సంబంధించి ఐదు బిల్లులను వేర్వేరుగా సభలో ప్రవేశపెట్టగా మొత్తం 5 బిల్లులను శాసనసభ ఆమోదించింది.

**బిల్లుల వివరాలు..**

1. నాలా చట్టం రద్దుతో మున్సిపాలిటీలు అదనపు అభివృద్ధి చార్జీలు వసూలుకు సంబంధించి చట్ట సవరణకు ఆమోదం.
2. బహుళ అంతస్తుల భవనాల ఎత్తును 18 మీటర్లకు బదులు 24 మీటర్లకు మారుస్తూ చట్ట సవరణకు ఆమోదం.
3. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించేలా చట్ట సవరణకు ఆమోదం.
4. ఏపీలో పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటర్‌గా నమోదు చేసుకునేందుకు గతంలో ఉన్న జనవరి 1వ తేదీ గడువుకు బదులు ఇకపై ఏప్రిల్ 1, జూలై1, అక్టోబర్ 1గా మారుస్తూ చట్ట సవరణ బిల్లు. ఈ బిల్లుకు ఆమోదం.
5. వైఎస్సార్ తాడిగడప మున్సిపాల్టీ పేరును తాడిగడప మున్సిపాల్టీగా మారుస్తూ చట్ట సవరణకు ఆమోదం.

# ఉత్తర, కోస్తాంధ్రలో మూడురోజులు వర్షాలు

- బంగాళాఖాతంలో అల్పపీడనం హెచ్చరికలు
- విపత్తుల నిర్వహణ ఎండీ ప్రఖర్ జైన్

అమరావతి (చైతన్యరథం): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శుక్రవారం ఉత్తర, ఆనుకుని ఉన్న మధ్య బంగాళాఖాతంలో అల్ప పీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది శనివారానికి దక్షిణ ఒడిశా–ఉత్తరాంధ్ర తీరాల వెంబడి వాయువ్య, పశ్చిమమధ్య బం గాళా ఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందన్నారు. శనివారం దక్షిణ ఒడిశా–ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని వెల్లడించారు. ఆదివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. దీని ప్రభావంతో శుక్రవారం కోస్తాం ధ్రలో కొన్నిచోట్ల భారీవర్షాలు, శుక్ర, శనివారాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షాలు, రాయలసీమలో అక్కడక్కడ తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని తెలిపారు. తీరం వెంబడి గంటకు 40–50 కిమీ వేగంతో ఈదు రు గాలులు వీచే అవకాశం ఉందన్నారు. భారీ వర్షాలు నేప థ్యం లో ప్రజలు చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, హోర్డింగ్స్ వద్ద ఉండరాదని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండా లని సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసు కోవా లన్నారు. పొంగిపొర్లే వాగులు, కాలువలు, రోడ్లు దాటే ప్రయ త్నం చేయరాదని సూచించారు.

# దళితులను పొట్టనబెట్టుకున్న జగన్‌రెడ్డి

- నారాయణ లాకప్‌డెత్‌పై దర్యాప్తు చేయించాలి
- పోలీసులే చంపి ఆత్మహత్యగా చిత్రీకరించారు
- పోస్టుమార్టం నివేదికనూ మార్చేశారు
- గత వైసీపీ పాలనలో ఎస్ఐ అరాచకాలు
- ఎస్సీ కమిషన్ నివేదికను బయటపెట్టాలి
- గత ఐదేళ్ల పాలన అక్రమ కేసులమయం
- ఇందుకు చంద్రబాబు కూడా బాధితుడే
- అసెంబ్లీలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



అమరావతి (చైతన్యరథం): సీబీఐ పెట్టిన 13 కేసుల్లో ముద్దాయి అయిన..రూ.43 వేల కోట్లు అవినీతికి పాల్పడిన వ్యక్తి ఐదేళ్ళ సీఎంగా రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. ప్రజా సొత్తును దోచుకోవడమే గాక ప్రతిపక్ష పార్టీ అనేదే ఉండకూడదనే కుట్రతో అక్రమ కేసులు నమోదు చేశారు. చంద్రబాబును కూడా వేధింపులకు గురిచేశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో అక్రమాలంటూ జైలులో పెట్టారు. ఆ కేసు సమయంలో పుణేకి వెళ్లి అప్పట్లో కాం ట్రాక్టర్‌గా వ్యవహరించిన కంపెనీ ఎండీతో మేము మాట్లాడాం. ఓ ఎంపీ వచ్చి కూర్చుని అప్రూవర్‌గా మారాలని బలవంతం చేసినా లొంగకుండా ఆ కంపెనీ ఎండీ రెండోసారి జైలుకెళ్లారు...అంతే కానీ తప్పు చేయని చంద్రబాబుపై ఒక్క ఆరోపణ కూడా చేయనని స్పష్టం చేశారు. మేము పుణేలో ఆయనను కలిసినప్పుడు తన ఆవేదన అంతా వెల్లడించారు. ఆ తెల్లారి ప్రముఖ పత్రికల్లో ఆయన ఆక్రోశానికి సంబంధించిన వార్త సంచలనమైంది. ఆ సమయంలోనే గూడూరులోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల లో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించాం. 9600 మంది ఆ సెంటరులో శిక్షణ పొందారు. రూ.25 కోట్ల విలువైన పరికరాలు అక్కడ కనిపించాయి..ఇవన్నీ ప్రజల ముం దుకు తెచ్చాం. సాక్షాత్తు చంద్రబాబుపై కేసులు బనాయించి నా తలొగ్గకుండా పోరాడం..నాపైనా 18 అక్రమ కేసులు పెట్టారని తెలిపారు.

**దళితుడి లాకప్‌డెత్‌పై దర్యాప్తు చేయించాలి**

నా ఎస్సీలు, నా ఎస్టీలని పదేపదే స్టేట్‌మెంట్లు ఇచ్చిన జగన్‌రెడ్డి పాలనలో దళితులపైన అనేక దారుణాలు జరిగాయి. మా సర్వేపల్లి నియోజకవర్గంలో దళిత సోదరుడు ఉదయగిరి నారాయణను 2 వేలు కూలీ విషయంలో పొదలకూరు పోలీసులు నిర్బంధించి కొట్టి దంతో ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని తెల్లారేసరికి ఆయన సొంతూరు కందమూరి పక్కన ఉండే అడవిలో జామాయిల్ చెట్టు కు ఉరేసుకున్నట్లు వేలాడదీశారు. ఉద్దేశపూర్వకంగా పోస్టుమార్టం ప్రక్రియను ఆలస్యం చేశారు. మేం వెళ్లి హాస్పిటల్‌లో కూర్చోవడం తో మూడో రోజు ఆ ప్రక్రియ చేపట్టారు. ఓ వైద్యాధికారి మా దగ్గరకు వచ్చి పోస్టుమార్టం పూర్తి చేశామని, ఛాతీ, మర్మాంగాలపై తీవ్రగాయాలున్నాయని, హత్య అని స్పష్టంగా తెలుస్తోందని వెల్లడించారు. పోలీసులు మృతదేహాన్ని బలవంతంగా దహనం చేయించారు..తెల్లారే పోస్టుమార్టం నివేదికను మార్చి ఆత్మహత్యగా చిత్రీకరించారు. జాతీయ ఎస్సీ కమిషన్‌ను కలిసి వివరించగా ఓ నివేదిక రూపొందించారు..అన్నీ అనుమానాస్పదంగా ఉన్నాయని తేల్చారు. అదేరోజు సాయంత్రానికి ఉదయగిరి నారాయణ కుటుం బానికి 8.40 లక్షలు పరిహారం చెల్లించారు. ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ.5 వేల శాశ్వత పింఛన్, మూడు ఎకరాల పొలం, మూడు సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేశారు. ఇప్పటికీ నేషనల్ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ ఇచ్చిన రిపోర్టు బయటకు రాలేదు...ఆ రిపోర్టును వెంటనే బయటపెట్టాలని హోం మంత్రిని కోరుతున్నా. ఉదయగిరి నారాయణను కొట్టి చంపిన ఎస్సై అంతకుముందు వెంకటాచలం పోలీసుస్టేషన్‌లో నూ పనిచేశారు.. అక్కడ ఇద్దరు ముస్లిం యువకుల చావుకు కారణమయ్యాడు. చర్యలు తీసుకోవాల్సిందిపోయి అప్పట్లో మంత్రిగా వ్యవహరించిన పెద్ద మనిషి ఆ ఎస్సైను పొదలకూరుకు వేయించుకున్నాడు. అక్క డ ఉదయగిరి నారాయణను బలి తీసుకున్నాడు. అమాయకుల ప్రాణాలు బలితీసుకున్న ఎస్సైని ప్రోత్సహించిన వ్యక్తికి జగన్‌రెడ్డి మంత్రిగా ప్రమోషన్ ఇవ్వడం వైసీపీ పాలనలో చూశాం. 13 కేసుల్లో ముద్దాయిగా ఉన్న జగన్‌రెడ్డి నిత్యం అందరి అంతు చూస్తా నంటూ బెదిరిస్తున్నాడు. ప్రజా ప్రతినిధులపై నమోదైన కేసుల్లో విచారణ ఏడాదిలో పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గ దర్శకాలు కూడా ఉన్నాయి. తప్పులు చేసిన వారు దశాబ్దాల పాటు బయట తిరుగుతుంటే మరిన్ని తప్పులు జరిగిపోతు న్నాయి. రాష్ట్రం ఇక తిరిగికోలు కునేదెప్పుడు? నా నియోజక వర్గంలోని కోడూరులో 16 ఎకరాల రొయ్యల గుంతలను ధ్వంసం చేసి కోట్ల విలువైన సంపదను సముద్రం పాల్జేశారు. పొదలకూరులో 14 మంది అమాయక ఆర్యవైశ్యులను అక్రమ కేసులతో జైలుకు పంపారు. సాగునీటి పైపులైన్లను పగల గొట్టించి 18 ఎకరాల సంపంగి పూల తోటలను బీడు పెట్టించా రు. నా మీద 18 అక్రమ కేసులు పెట్టడంతో పాటు 57 మంది అమాయకులపై అక్రమ కేసులు పెట్టి రోజులు, నెలల తరబడి జైళ్లలో పెట్టించారు. అమరావతి రైతుల పాదయాత్ర సందర్భం గా టెంట్లు పెరి కించేసి రోడ్లపై భోజనం చేసే పరిస్థితి తెచ్చారు. పోలీసులను పదేపదే బెదిరించడం వైసీపీ అధినేతకు, ఆయన అనుచరులకు అలవాటుగా మారిపోయింది. నడిరోడ్డులో ఓ ఇన్‌స్పెక్టర్ దుస్తు లిప్పుతామంటూ రంకెలేస్తారు. పురుషుల దుస్తులు పురుషులు విప్పేదేంటో అర్థం కావడం లేదు.. ఉదయగిరి నారాయణ లాకప్ డెత్‌ను ఆత్మహత్యగా మార్చిన ఘటనపై సిట్‌తో విచారణ జరిపించాలని కోరారు. పోస్టుమార్టం నివేదికను మార్చేసిన అధికారి కర్నూలులోనూ అలాంటి తప్పు చేసి సస్పెన్షన్‌కు గురై ఉన్నాడు. అమాయక దళితుడిని బలితీ సుకున్న కేసులో ఏ ఒక్కరినీ వదిలిపెట్టవద్దని ప్రభుత్వానికి విన్నవించారు.

## 34 లక్షల మంది మహిళలకు వైద్యపరీక్షలు

- అక్టోబర్ 2 వరకు శిబిరాలు కొనసాగింపు
- వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్
- నున్నలో ఉచిత వైద్యశిబిరం సందర్శన



అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 17 నుంచి ప్రారంభమైన "స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్ర మంలో భాగంగా సుమారు 34 లక్షల మంది మహిళలకు వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. 16 వేలకు పైగా వైద్యశిబిరాల ద్వారా మహిళలు ఉచిత పరీక్షలు చేయించుకుంటు న్నారన్నారు. మహిళలు 8 రకాల ఉచిత పరీక్షలు చేయించుకుంటున్నారని తెలిపారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా నున్నలో ఏర్పా టు చేసిన "స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" వైద్య శిబిరాన్ని మంత్రి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వికల్ క్యాన్స ర్), ఇతర స్క్రీనింగ్ పరీక్షలను చేస్తున్నట్లు తెలిపారు. ముందస్తు పరీక్షల ద్వారా అనుమానిత లక్షణాలున్నట్లు గుర్తించిన వారికి తదుపరి చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. అక్టోబర్ 2 వరకు వైద్య శిబిరాలు కొనసాగు తాయన్నారు. ఈ శిబిరాల ద్వారా మహిళలు, చిన్నారులు, బాలబాలికలకు కలిపి కోటిన్నర మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. స్వస్థ్ నారి అంటే ఆరోగ్యవంతమైన మహిళ అని, సశక్త్ పరివార్ అంటే ఒక శక్తివంతమైన కుటుంబంలో అత్యంత ముఖ్య భూమిక పోషించే మహిళ ఆరోగ్యవంతంగా ఉంటే ఆ కుటుంబం కూడా ఆరోగ్య వంతంగా, శక్తివంతంగా తయారవుతుందని మంత్రి వివరించారు.

**క్యాన్సర్ పరీక్షలు**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత ప్రతి గ్రామంలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ నోటి క్యాన్సర్ పరీక్షలు, 18 ఏళ్లు నిండిన ప్రతి యువతికీ రొమ్ము క్యాన్సర్ పరీ క్షలు, 30 ఏళ్లు నిండిన ప్రతి మహిళకీ సర్వైకల్ క్యాన్సర్ పరీక్ష లు ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. మెడికల్ ఆఫీసర్లు, సూపర్ స్పెషలిస్టులు, స్పెషలిస్టులు, ఏఎన్ఎంలు దాదాపు 18 వేల మంది రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. 24 గంటలూ పనిచేసే శాఖ ఏదైనా ఉందా అంటే అది ఒక్క వైద్య ఆరోగ్య శాఖే అని, నిబద్ధతతో పనిచేస్తున్న వైద్య సిబ్బందిని అభినందించారు.

**ఎన్టీఆర్ అంతటివారు పండిట్ దీన్ దయాళ్**

ఎన్టీఆర్ గురించి గొప్పగా ఎలా మాట్లాడుకుంటామో.. ఉత్తరా దిలో ఏ రాష్ట్రానికెళ్లినా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గురించి అలా చెప్పుకుంటారు. కుటుంబం కన్నా దేశహితం ముఖ్యమని, దేశంలో ఉంటున్న కోట్లాది ప్రజల అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమని ఆయన భావించారు. ఈ దేశంలో ఆర్థిక సంస్కరణలు పేదవారిని దృష్టిలో పెట్టుకుని తీసుకురావాలని మొట్టమొదట చెప్పిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ దేశం కోసం పని చేయాలన్న ఉద్దేశంతో జీవితాంతం బ్రహ్మచారిగా ఉండిపోయారని పేర్కొన్నారు.

## కారవాన్ టూరిజం అభివృద్ధికి చర్యలు

- ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ




విజయవాడ(చైతన్యరథం): రాష్ట్రంలో కారవాన్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్ర పాలి కాటా, ఓజేబ కారవాన్ ప్రతినిధులతో కలిసిన విజయ వాడ టూరిజం కార్పొరేట్ కార్యాలయంలో ఓజేబ కారవాన్‌ను పరిశీలిం చారు. ఈ సందర్భంగా కారవాన్ టూరిజం ప్రత్యేకతలు, వీటి ద్వారా పర్యాటక రంగానికి వచ్చే అవకాశాలను వివరంగా అవిష్క రించారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక ప్రాంతాల్లో కారవాన్‌లు ప్రవేశపెట్టడం ద్వారా దేశీ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షిం చవచ్చని పేర్కొన్నారు. కారవాన్ టూరిజం ద్వారా పర్యాటకులకు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని కలిగించడం మరియు అణచివేతలో ఉన్న పర్యాటక ప్రదేశాలను వెలికితీయడమే లక్ష్యమ ని తెలిపారు. ఓజేబ కారవాన్ యూనిట్స్ ఆధునిక సౌకర్యాలతో రూపొందించబడి, పర్యాటకుల అవసరాలను తీర్చగలగడం విశేష మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ అధికారులు, ఓజేబ ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కారవాన్ టూరిజానికి అన్ని విధాలుగా మద్దతు అందించేందుకు సిద్ధంగా ఉందని, త్వరలోనే కొన్ని ప్రాధాన్యత కలిగిన పర్యాటక ప్రాంతాల్లో ఈ సదుపాయాలను ప్రారంభించేం దుకు చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. కారవాన్ టూరిజం ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి కొత్త ఊపు లభించనుంది.

## విజయవంతంగా మహిళల కుట్టు శిక్షణ

- వారి సంక్షేమానికి సీఎం చంద్రబాబు పెద్దపీట
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



అమరావతి (చైతన్యరథం): సీఎం చంద్రబాబు మహిళా పక్షపాతి అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. శాసనసభ సమావేశాల్లో ఆరో రోజు గురువారం ఎమ్మెల్యే బత్తుల బాలరామకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళా పారిశ్రామిక వేత్తను తయారు చేయాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని చెప్పారు. అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో మహిళల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారు. 2019-24 మధ్య వైసీపీ పాలనలో మహిళల సంక్షేమాన్ని గాలికొదిలేశారు. మళ్లీ సీఎం చంద్రబాబు అధికారంలోకి రాగానే మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారు. మహిళలకు టైలరింగ్ శిక్షణతో పాటు కుట్టు మిషన్ కూడా ఉచితంగా అందజేస్తున్నాం. రాష్ట్రంలో మహిళల కుట్టు శిక్షణ విజయవంతంగా నిర్వహిస్తున్నాం. శిక్షణ పట్ల మహిళల్లో సంతోషం వ్యక్తమవుతోంది. శిక్షణకు హాజరయ్యే మహిళలకు ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) హాజరు తీసుకుంటున్నాం. 90 రోజుల పాటు టైలరింగ్ శిక్షణ అందజేస్తున్నాం. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్ ఉచితంగా ఇవ్వడమే కాకుండా సర్టిఫికెట్ కూడా ఇస్తున్నాం. గార్మెంట్ పరిశ్రమల్లో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉపాధి లభించేలా ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో ఒప్పందాలు చేసుకుంటున్నామని మంత్రి సవిత తెలిపారు.

# సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది : స్పీకర్ అయ్యన్న

●విజయవాడ ఉత్సవ్‌కు హాజరైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు

●ఇకపై ప్రత్యేక ఏటా విజయవాడ ఉత్సవ్ నిర్వహణ.. ఎంపీ కేశినేని శివనాథ్..



విజయవాడ (చైతన్యరథం): కనుమరుగవుతున్న సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించారు. ప్రజల ఆధునిక పోకడలతో సంస్కృతి మారిపోతుందని, పండుగ వచ్చిందంటే పల్లెల నుంచి పట్టణాల వరకు రికార్డింగ్ డాన్సులు జరుగుతున్నాయన్నారు. భవిష్యత్తు తరాలకు మన ఆచార, సంప్రదాయాలు, సంస్కృతి తెలియడానికి ఇలాంటి ఉత్సవాలు దోహదం చేస్తాయని తెలిపారు. వేదికపై మహిళామణులు ప్రదర్శించిన చేనేత చీరలన్నీ మన రాష్ట్రంలోనే తయారు చేయడం గర్వకారణమని, ఈ ప్రదర్శన ద్వారా మన చీరల గొప్పదనం రాష్ట్ర వ్యాప్తంగా తెలిసిందని అన్నారు. మన సంస్కృతిని మరిచిపోకూడదని ఇలాంటి ఉత్సవాన్ని నిర్వహిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, కమిటీ సభ్యులను ఆయన అభినందించారు.

**శాసనసభ ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ..** విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తున్నామని ఎంపీ కేశినేని శివనాథ్ తనను కలిసి ఆహ్వానించినప్పుడు, ఒకపక్క వర్షాలు కురుస్తుంటే నిర్వహణ సాధ్యపడుతుందా.. అనిపించిందని, మంచి ఆలోచనకు మన సంకల్పం తోడైతే ప్రకృతి కూడా సహకరిస్తుందని ఈరోజు ఇంత వైభవంగా జరుగుతున్న ఉత్సవాన్ని చూస్తే నిజమే అనిపిస్తుందన్నారు. ప్రతిరోజు అంతరాయం లేకుండా ఎంపీ పర్యవేక్షణలో ఉత్సవ్ కమిటీ సభ్యులు అద్భుతంగా నిర్వహిస్తున్నారని ఆయన కొనియాడారు. మైసూరు చాముండేశ్వరి అమ్మవారి దసరా ఉత్సవాల తరహాలో విజయవాడ ఉత్సవ్ నిర్వహించాలని ఆలోచన రావడం గొప్ప విషయం అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం సహకారంతో విజయవాడను వెనిస్ నగరం మాదిరి తీర్చిదిద్దేందుకు ఇక్కడి ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఆయన సూచించారు. తాను పుట్టి, పెరిగింది విజయవాడలోనేనని, ఒకప్పుడు వెలుగులు విరజిమ్మిన నగరం ప్రస్తుత ప్రభుత్వంలో అభివృద్ధి తీసుకునే పరుగులు తీస్తుందనే నమ్మకం కలిగిందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ఈ ఉత్సవం మరింత విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు.

**ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ..** సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో చేపట్టిన విజయవాడ ఉత్సవ్ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అంగరంగ వైభవంగా ప్రారంభమైందని తెలిపారు. సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు ఈ ఉత్సవానికి హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. మైసూరు తరహాలో విజయవాడ ఉత్సవ్ ను ఇకపై ప్రత్యే ఏటా ఘనంగా నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. ప్రజల భాగస్వామ్యంతో ఆధ్యాత్మికత, వినోదం, సాంస్కృతికం సమ్మిళితంగా ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.



**ఘంటమనేని ఆదిశేషు మాట్లాడుతూ..** విజయవాడ ఉత్సవ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎంపీ కేశినేని శివనాథ్, కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. నిర్మొహమాటంగా ముక్కు సూటిగా మాట్లాడే అయ్యన్నపాత్రుడు, రఘురాం కృష్ణంరాజుకు రాజ్యాంగ పదవులు ఇచ్చి, వీరి నోటికి తాళం వేసారని చలోక్తి విసరగానే సభలో నవ్వులు విరిసాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, తంగిరాల సౌమ్య, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ కమిషనర్ వేదవాణీ, టూరిజం శాఖ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీ సృజనాత్మకత మరియు సంస్కృతి కమిషన్ చైర్మన్ పి. తేజస్విని, ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు నగరంలో కలకలం రేపుతున్న డయేరియా కేసులు



గుంటూరు (చైతన్యరథం): గుంటూరులో డయేరియా కేసులు పెరుగుతుండటంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. నగరంలో అతిసారం కేసులు అధికంగా ఉన్న ప్రాంతాలను హాట్‌స్పాట్లుగా గుర్తించి కట్టడి చర్యలపై దృష్టి సారించింది. ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేయడంతో పాటు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేస్తోంది. వ్యాధి వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితుల సంఖ్య వందకు పైగా చేరడంతో జిల్లా అధికారులు కట్టడి చర్యలు కట్టుదిట్టం చేశారు. ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రగతి నగర్‌లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జీఎంసీ మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు పర్యటించి కార్పొరేషన్ సిద్ధం చేసిన కిట్స్ పంపిణీ చేశారు.

# సంతోషంలో సానా సతీష్ బాబు ఫౌండేషన్! స్పెషల్ గిఫ్ట్‌గా డీఎస్సీ విజేతలు!



కాకినాడ (చైతన్యరథం): సానా సతీష్‌బాబు ఫౌండేషన్ వ్యవస్థాపకుడిగా, కాకినాడ ప్రజల కోసం ఫౌండేషన్ చేస్తున్న సేవలు నాకెంతో స్ఫూర్తినిస్తున్నాయని సంస్థ చైర్మన్ తలాటం హరీష్ వ్యాఖ్యానించారు. సానా సతీష్‌బాబు నాయకత్వంలో, కాకినాడ జిల్లా లైబ్రరీ ద్వారా అనేకమంది విద్యార్థులకు విలువైన పుస్తకాలు మరియు ఇతర వనరులను అందించగలిగామన్నారు. ఈ రోజు ఆ విద్యార్థుల్లో చాలామంది ఏపీ డీఎస్సీలో విజయాన్ని సాధించారు. ఈ ఫలితాలు వారి కృషికే కాకుండా, సమయానుకూల మార్గదర్శకత్వం మరియు సహాయానికి ప్రతిబింబంగా నిలిచాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న గౌరవనీయ సీఎం ఎన్‌సీబీఎన్‌కి, అత్యంత పారదర్శకంగా నియామక ప్రక్రియను పూర్తిచేసిన యువజన, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. డీఎస్సీ నిర్వహణ అంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు.

# మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన అందరికీ శుభాకాంక్షలు

●ఈ తరుణం... రాష్ట్ర విద్యారంగా చరిత్రలో నిలిచిపోతుంది: ఎమ్మెల్యే రాము



గన్నవరం (చైతన్యరథం): మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఏపీ రాజధాని అమరావతిలో నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం గురువారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సహచర ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్ లతో కలిసి పాల్గొన్న గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము... నియామక పత్రాలు అందుకున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా టాప్ 20లో నిలిచిన వారికి సీఎం చంద్రబాబు ఉపాధ్యాయ నియామక పత్రాలు అందించగా... మిగిలిన వారికి జిల్లాల వారీగా అధికారులు, ఎమ్మెల్యేలు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా అర్హత సాధించిన గుడివాడ పరిసర ప్రాంతాలకు చెందిన పలువురికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నియామక పత్రాలను అందించారు. ఏక కాలంలో 15,941 మంది ఉపాధ్యాయులను నియమించిన ఈ శుభ సమయం రాష్ట్ర విద్యా రంగంలో చిరస్థాయిగా మిగిలిపోతుందనీ ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమంలో పాల్గొనడం తమకు ఎంతో సంతోషకరమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా సీఎం చంద్రబాబు చేసిన కృషిలో ఉపాధ్యాయులు భాగస్వామ్యులు కావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. ముందుగా జరిగిన సభలో, మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి కృష్ణాజిల్లా ఎమ్మెల్యేలతో కలిసి వెనిగండ్ల రాము పాల్గొన్నారు.

# శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దేవీచౌక్ బాలాత్రిపుర సుందరి ఆలయం వద్ద జరుగుతున్న దసరా ఉత్సవాలకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించాలని అమ్మవారిని వేడుకొన్నారు. ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు వేదమంత్రాలతో స్వాగతం పలికారు.

# తన దుర్మార్గ పాలనకు బలైన వారికి డిజిటల్ బుక్‌లో ఎందుకుస్థానం లేదో జగన్ చెప్పాలి

● అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలపై మాట్లాడే ధైర్యం లేని జగన్... పారదర్శకంగా పనిచేస్తున్న వ్యవస్థల్ని బ్లాక్ మెయిల్ చేయడం చట్టరీత్యా నేరం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట (చైతన్యరథం): “ముఖ్యమంత్రిగా ప్రజలిచ్చిన ఐదేళ్ల కాలాన్ని దుర్వినియోగం చేసిన జగన్‌రెడ్డి.. రాష్ట్రాన్ని ప్రజల్ని గాలికి వదిలేసి స్వప్రయోజనాలే లక్ష్యంగా విధ్వంసకర పాలన సాగించాడు. తన అవినీతి, అక్రమాలను ప్రశ్నించిన పాపానికి వేలమంది దళితులు.. బీసీలు.. మైనారిటీలను పొట్టనపెట్టుకున్నాడు. ఇప్పుడు తనను గెలిపించిన పులివెందుల ప్రజల బాగోగులు పట్టించుకోకుండా డిజిటల్ బుక్‌లు.. యాప్‌లు.. పిటిషన్ల పేరుతో ప్యాలెస్‌లలో కాలక్షేపం చేస్తున్నాడు. తాను ఆవిష్కరించిన డిజిటల్ బుక్ ద్వారా జగన్ ఏం సందేశం ఇస్తున్నాడో, ఎవరికి సినిమా చూపిస్తాడో సమాధానం చెప్పాలి.” టీడీపీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. రాజ్యాంగానికి లోబడి, సమర్థంగా విధినిర్వహణ చేస్తున్న అధికారులకా? తప్పు చేసిన వారిని సమగ్ర విచారణతో న్యాయబద్ధంగా శిక్షిస్తున్న ప్రభుత్వానికా? పరోక్షంగా ప్రభుత్వ వ్యవస్థలపై బెదిరింపులకు పాల్పడుతున్నందుకు న్యాయస్థానాలు జగన్‌పై సుమోటోగా చర్యలు తీసుకోవాలి. అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై మాట్లాడే ధైర్యంలేని జగన్.. పారదర్శకంగా పనిచేస్తున్న వ్యవస్థల్ని బ్లాక్ మెయిల్ చేయడం చట్టరీత్యా నేరం.



**డిజిటల్ బుక్‌లో తన దుర్మార్గాలకు బలైన దళితులు.. బీసీలు.. మైనారిటీల వివరాలు ఎందుకు లేవో జగన్ చెప్పాలి**

డిజిటల్ బుక్‌లో తన దుర్మార్గపాలనకు బలైన దళితులు, మైనారిటీలు, బీసీలకు ఎందుకు స్థానం లేదో జగన్ చెప్పాలి? డాక్టర్ సుధాకర్ మొదలు... కోడికత్తి శ్రీను, డ్రైవర్ సుబ్రహ్మణ్యం. అనితారాణి. దోమతోటి విక్రమ్, వరప్రసాద్.. అబ్దుల్ సలామ్.. హాజీరా.. చిన్నారి మిస్బాలను బలితీసుకున్న వివరాలు ఏ బుక్‌లో భద్రపరిచాడో జగన్ ప్రజలకు చెప్పాలి. అక్రమార్జనే ధ్యేయంగా తాను అమ్మించిన విషపూరిత మద్యం.. కల్తీసారాకు బలైనవారు.. కరోనా సమయంలో ఆక్సిజన్ దొరక్క మరణించిన వేలమంది వివరాలు ఏ బుక్‌లో ఉన్నాయో జగన్ చెప్పాలి.” అని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు.

# స్వచ్ఛ భారత్ లక్ష్య సాధనకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

**●ఏక్ దిన్ - ఏక్ గంటా... ఏక్ సాత్ కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): స్వచ్ఛ భారత్ లక్ష్య సాధనకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా చుట్టుగుంట వాకింగ్ ట్రాక్ వద్ద ప్రజలతో, మున్సిపల్ కార్మికులతో కలిసి ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాస్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ... మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని సెప్టెంబర్ 17న మొదలై అక్టోబర్ 2 వరకు ప్రతి రోజూ ప్రణాళికాబద్ధంగా స్వచ్ఛ భారత్ – స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యంతో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. "ఏక్ దిన్ – ఏక్ గంటా – ఏక్ సాత్" అనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ కనీసం గంటసేపైనా పరిశుభ్రత కోసం కృషి చేయాలని, ఈ బాధ్యత ఒక్క రోజు లేదా గంటకు పరిమితం కాకుండా ప్రతి రోజూ అలవాటుగా మారాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే తీవ్ర దుష్పరిణామాలను ప్రస్తావిస్తూ, ప్రజలందరూ ప్లాస్టిక్‌రహిత జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. చిన్న చిన్న చర్యలు కూడా పెద్ద మార్పులు తెస్తాయని గుర్తుచేస్తూ, ప్లాస్టిక్ కవర్లలో ఇచ్చే ఆహారాన్ని నిరాకరించడం, పిల్లలకు స్టీల్ డబ్బాలు, బాటిళ్లను ఉపయోగించడం వంటి చిన్నచిన్న మార్పులు సమాజంపై గొప్ప ప్రభావం చూపుతాయని అన్నారు. ప్రతి ఒక్కరు ఒక గంటపాటు శ్రమదానం కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న ప్రజలందరికీ ధన్యవాదాలు తెలుపుతూ, పరిశుభ్రమైన భారతదేశం నిర్మాణంలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా పరిశుభ్రతా కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడకా పద్మావతి, తుమ్మల నాగేశ్వరరావు, కామినేని చంద్ర, గాడిదపాటి కోటేశ్వరరావు, విజయలక్ష్మి, గుర్రం ప్రసాద్, పునుగుపాటి ఆంజనేయులు, ఖాసిం సైదా తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో విద్యారంగంలో అనేక మార్పులు : ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ

అమరావతి సచివాలయం ప్రాంగణంలో జరిగిన మెగా డీఎస్సీ – 2025లో నూతనంగా నియమితులైన అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా నియామక పత్రాలు అందచేసే కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా నాయకులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు.

# బ్రాహ్మణుల సొమ్ము కాజేసిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి

**● ప్రభుత్వాన్ని కోరిన రాష్ట్ర బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్**



గుంటూరు (చైతన్యరథం): వైసీపీ ఐదేళ్ల పాలనలో బ్రాహ్మణులు దాచుకున్న సొమ్ములను వైసీపీ నేతలు దోచుకున్నారని, ఈ కుంభకోణంపై వెంటనే కూటమి ప్రభుత్వం విచారణ ప్రారంభించి దోషుల్ని శిక్షించి బ్రాహ్మణులకు న్యాయం చేయాలని రాష్ట్ర బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ కోరారు. పేద, మధ్య, ఉన్నత తరగతి బ్రాహ్మణుల సంక్షేమం కోసం అప్పటి, ఇప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు నేతృత్వంలో ఆనాటి ప్రభుత్వం బ్రాహ్మణ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ 40 కోట్ల రూపాయల మూలనిధితో ఏర్పాటు చేశారని సిరిపురపు శ్రీధర్ శర్మ తెలిపారు. బ్రాహ్మణ కోపరేటివ్ సొసైటీలో బ్రాహ్మణులు దాచుకున్న డబ్బులను గత వైసీపీ ప్రభుత్వంలో దోచుకున్నారని, గత వైసీపీ ప్రభుత్వానికి ఈ సొసైటీ సీఈవో తాబేదారిగా మారి, సర్వీస్ రూల్స్‌కి వ్యతిరేకంగా ఒకేచోట ఏనిమిదేళ్లుగా ప్రభుత్వ ఉద్యోగంలో డిప్యూటేషన్‌పై వచ్చి బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీలో పాతుకుపోయి రెండు జీతాలు తీసుకుంటున్న బ్రాహ్మణ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సీఈవో జి.నాగసాయిపై గత జగన్ ప్రభుత్వం నుండి నేటి వరకు ఎన్నో ఫిర్యాదులు వచ్చిన సరే ఆయనపై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు.

# వైసీపీ ఇంకా హింసను ప్రోత్సహిస్తూనే ఉంది : యరపతినేని



అమరావతి (చైతన్యరథం): వైకాపా హయాంలో రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన సాగిందని టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేసి ప్రజల్ని ఇబ్బందులకు గురిచేశారని చెప్పారు. పల్నాడు ప్రాంతంలో టీడీపీ కార్యకర్తలు గ్రామాల్లో ఉండలేని పరిస్థితి కల్పించారన్నారు. సీఎం చంద్రబాబు పాలనతో శాంతిభద్రతలు బాగున్నాయని చెప్పారు. శాంతిభద్రతలపై శాసనసభలో జరిగిన లఘుచర్చలో యరపతినేని మాట్లాడారు. "వైసీపీ పాలనలో టీడీపీ ముఖ్యనేతలు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, సోమిరెడ్డి వంటివారిపై అక్రమ కేసులు పెట్టారు. టీడీపీ కార్యకర్తలపై కేసులు పెట్టి వేధించారు. 2019–24 మధ్య రాష్ట్రంలో దాదాపు 80 మంది కార్యకర్తలు హత్యకు గురవగా... 250 మంది గాయపడ్డారు. వందలాది మహిళలు అత్యాచారాలకు గురయ్యారు. వైసీపీ నాయకత్వం హింసను ఇంకా ప్రోత్సహిస్తూనే ఉంది. సీఎంగా పనిచేసిన జగన్.. కత్తితో నరికితే తప్పేంటని అంటున్నారు. దమ్ము, ధైర్యం ఉంటే ఎవరిని నరుకుతారో పేర్లు ఇవ్వండి. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ శంకరయ్య తీరు ఆక్షేపణీయం. ముఖ్యమంత్రికి ఆయన నోటీసులు ఇస్తారా? గురజాలలో వైసీపీ నేతలు చేసిన అక్రమ మైనింగ్ గుంతల్లో పడి 11 మంది పిల్లలు చనిపోయారు" అని యరపతినేని శ్రీనివాసరావు అన్నారు.

# ఒకే నగరం- ఒకే ఉత్సవంతో మెరిసిన విజయవాడ ఉత్సవ్

**●ఉత్సవ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ నగరం నవరాత్రి శోభతో కళకళలాడుతోంది. "ఒకే నగరం – ఒకే ఉత్సవం" అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సారథ్యంలో శ్రేయాస్ మీడియా నిర్వహణలో జరుగుతున్న విజయవాడ ఉత్సవ్ ఆధ్యాత్మిక, సంస్కృతి, సంప్రదాయం, వినోదం ఒకే రూపంలో మెరిసిపోతోంది. ఎంపీ కేశినేని శివనాథ్ పర్యవేక్షణలో తుమ్మలపల్లి కళాక్షేత్రం, పున్నమి ఘాట్, సంగీత కళాశాల వేదికలు ప్రతిరోజూ వైభవంగా మారి నగర వాసులకు కొత్త అనుభూతిని అందిస్తున్నాయి. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఉత్సవాన్ని ఘనంగా ప్రారంభించగా, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ సెకావత్, గవర్నర్ జనాబ్ ఎస్.అబ్దుల్ నజీర్, ఏపీ, తెలంగాణ బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్, రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరై ఉత్సవానికి ప్రత్యేక శోభను చేకూర్చారు. గొల్లపూడి సమీపంలోని మైదానంలో ఏర్పాటు చేసిన భారీ ఎగ్జిబిషన్ ఈనెల 27వ తేదీ నుంచి సందర్శకులను అలరించనుంది. ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దీన్ని ప్రారంభించనుండడం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇందులో మ్యూజిక్ కన్సర్ట్స్, వినోద కార్యక్రమాలు, ఫుడ్ స్టాల్స్, ఆధునిక స్టాళ్లు ఉండగా, కుటుంబాలతో వచ్చిన సందర్శకులు మరింత ఆనందాన్ని పొందనున్నారు. పున్నమి ఘాట్, తుమ్మలపల్లి కళాక్షేత్రం, సంగీత కళాశాల వేదికలపై ప్రతిరోజూ జరుగుతున్న సంగీత, నృత్య, శాస్త్రీయ, జానపద ప్రదర్శనలు సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు, నగర వాసులు కుటుంబ సమేతంగా ఈ వేదికలను సందర్శిస్తూ ఉత్సవాన్ని మరింత ప్రత్యేకంగా మార్చుతున్నారు. అదేవిధంగా ప్రతిరోజూ జరిగే డ్రోన్ షో, క్రాకర్స్ షో, హెలికాప్టర్ రైడ్ విజయవాడ ఉత్సవ్ ప్రత్యేక ఆకర్షణలుగా నిలుస్తున్నాయి. చిన్నారులు నుంచి పెద్దల వరకు అందరూ ఆస్వాదించే ఈ వినోదాలు ఉత్సవ వైభవాన్ని మరింత పెంచుతున్నాయి. ఈ ఉత్సవాలు అక్టోబర్ 2 వరకు కొనసాగనున్నాయి. రాబోయే రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి, ఒరిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొననున్నారు. దీంతో రానున్న రోజుల్లో విజయవాడ ఉత్సవ్‌ను మరింత గ్లోరియస్‌గా నిలబెట్టనున్నాయి. విజయవాడ ఉత్సవ్ – ఒకే నగరం, ఒకే ఉత్సవం సంస్కృతి, సంప్రదాయం, వినోదానికి సమగ్ర ప్రతిరూపం.

**గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో విజయవాడ పేరు నమోదు దిశగా**

**భారీ కార్యక్రమం**

విజయవాడ శరన్నవరాత్రి వేడుకలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ నిత్యం శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 28న నగరంలో భారీ స్థాయిలో కార్నివాల్ తరహా ఊరేగింపును చేపట్టేందుకు సన్నాహాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజ్ సర్కిల్ వరకు సుమారు మూడు వేల మంది కళాకారులు దసరా వేషధారణలతో పాల్గొని, అమ్మవారి ఊరేగింపును వైభవంగా అలంకరించనున్నారు. భిన్న సంస్కృతులు, జానపద కళారూపాలు, సాంప్రదాయ వేషధారణలతో అలరించనున్న ఈ ప్రదర్శనను "కార్నివాల్" పేరిట నిర్వహించనున్నారు. ప్రపంచ ప్రఖ్యాత గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో విజయవాడ పేరు చెరగని అక్షరాలతో నిలిపే ప్రయత్నంలో భాగంగానే ఈ విశేష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీ శివనాథ్ తెలిపారు.

# స్వచ్ఛతకు రోజులో గంట కేటాయించండి... పరిశుభ్రతను బాధ్యతగా తీసుకోండి

**● కలెక్టర్, కమిషనర్‌తో కలిసి స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్**



గుంటూరు (చైతన్యరథం) : మనందరం కలిసి రోజుకు ఒక గంట సమయాన్ని సమాజం కోసం, స్వచ్ఛత కోసం కేటాయించాలని, ఇదే దేశానికి మనమిచ్చే కానుక అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛహి సేవలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు గుంటూరులో ఏక్ దిన్ ఏక్ గంట ఏక సాత్ థీమ్‌తో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, మునిసిపల్ కమిషన్ పులి శ్రీనివాసులు, ఇతర అధికారులు, వందల సంఖ్యలో ప్రజలతో కలిసి ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. తొలుత వీధులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ మార్పు మన ఇంటి నుంచే ప్రారంభం కావాలని చెప్పారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలను ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఇందులో భాగంగా మొక్కలు నాటడం, పరిసరాల పరిశుభ్రత, సమాజ సేవ వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నామని వెల్లడించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దీనికి ఒక ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. మనం రోడ్డుపై ఎలాంటి చెత్తాచెదారాలు వేయకూడదని, దీనికి ఒక నినాదంగా తీసుకోవాలని సూచించారు. దేశం కోసం ప్రత్యేకంగా ఒక రోజును కేటాయించాలని, సమాజ సేవకు రోజులో ఒక గంట వెచ్చించాలని కోరారు.

# రాప్తాడు నియోజకవర్గంలో ముఖ్య రహదారుల నిర్మాణానికి 90కోట్లు ఇవ్వండి

**●లో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి 5సబ్ స్టేషన్లు మంజూరు చేయండి**

**●మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, గొట్టిపాటికి ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి**

**●సర్దార్ గౌతులచ్చన్న వారసుడు శ్యాంసుందర్ శివాజీని కలిసిన ఎమ్మెల్యే సునీత**



రాప్తాడు (చైతన్యరథం): నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోసం పలువురు మంత్రులను ఎమ్మెల్యే పరిటాల సునీత కలిశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆమె మంత్రులు, పలువురు ప్రముఖుల్ని కలుస్తూ బిజీబిజీగా గడిపారు. దేవీ దసరా శరన్నవరాత్రుల సందర్భంగా కనకదుర్గమ్మ అమ్మవారి రోజు వారీ అలంకరణలో భాగంగా అసెంబ్లీకి పసుపు రంగు చీర ధరించి హాజరయ్యారు. రోజుకో రంగు దుస్తుల్లో అసెంబ్లీకి వెళ్లాలనే నిర్ణయం మేరకు గురువారం రోజు అమ్మవారికి శ్రీ కాత్యాయనీ దేవి అలంకారం ఉన్న నేపథ్యంలో మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి పసుపు రంగు దుస్తులు ధరించి అసెంబ్లీకి వెళ్లారు. టి.డి.జనార్దన్ రచించిన ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమం-సజీవ చరిత్ర పుస్తకాన్ని ఎమ్మెల్యే సునీతకు అందజేశారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 1984సంవత్సరం ఆగష్టు నెలలో ఏర్పడిన 32రోజుల సంక్షోభంపై ఈ పుస్తకాన్ని రచించారు. మరోవైపు స్వతంత్ర సమరయోధుడు, సర్దార్ గౌతులచ్చన్న వారసుడు, శ్రీకాకుళం జిల్లా, సోంపేట, పలాస నియోజకవర్గాల నుంచి 6సార్లు శాసనసభ్యులుగా ఎన్నికైన ప్రజా నాయకుడు, గౌతు శ్యాంసుందర్ శివాజీని ఎమ్మెల్యే సునీత మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని అసెంబ్లీ స్పీకర్ కార్యాలయంలో శ్యాంసుందర్ శివాజీని కలవగా.. ఆయన ఎంతో ఆప్యాయంగా పలుకరించారు. పలు అంశాల గురించి ఇరువురు నేతలు చర్చించుకున్నారు. అనంతరం రాప్తాడు నియోజకవర్గంలో సమస్యల మీద మంత్రులను కలిసి వినతి పత్రం అందజేశారు. నాలుగు ప్రధాన రహదారుల నిర్మాణానికి 90 కోట్ల నిధులను కేటాయించాలని ఆర్.అండ్.బి శాఖ మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డిని కోరారు. ప్రజలు తమ వ్యవసాయ వస్తువులను సమీప మార్కెట్ యార్డులకు రవాణా చేసేటప్పుడు, అలాగే ఈ మార్గంలో వెళ్లే ప్రయాణీకులు 4ప్రధాన రహదారుల్లో తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారని వివరించారు. అనంతపురం బైపాస్ నుంచి కనగానపల్లి రోడ్డు, కనగానపల్లి నుంచి చిగురుచెట్టు రోడ్డు, ధర్మవరం నుంచి కళ్యాణదుర్గం వెళ్లే మార్గంలో ఉన్న రోడ్డు, ఈనాడు కార్యాలయం నుంచి చిగిచెర్ల రోడ్లకు 90కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని కోరారు. అలాగే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని కలిసి 5సబ్ స్టేషన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో న్యామద్దల, మద్దలచెరువు, దాదులూరు, సోమల దొడ్డి, ఆలమూరు గ్రామాలలో వోల్టేజి సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీని వలన పంటలు పండించే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రికి వివరించారు. తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి ప్రజలు కూడా అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. గతంలో నియోజకవర్గానికి 9 కొత్త సబ్‌స్టేషన్ల మంజూరు చేయాలని కోరామని.. వాటిలో ఈ 5 సబ్‌స్టేషన్లు ఇప్పుడు అత్యవసరంగా మారాయన్నారు. మంత్రి సునీత విజ్ఞప్తులపై మంత్రులు సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి.. సాధ్యాసాధ్యాలు పరిశీలించి.. వెంటనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

# పసుపు రంగు దుస్తుల్లో అసెంబ్లీకి హాజరైన మహిళా నేతలు

**● దసరా ఉత్సవాల్లో భాగంగా 4 రోజు కాత్యాయిని దేవి అవతారం**



పుట్టపర్తి (చైతన్యరథం): దేవి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా నాలుగవ రోజు శ్రీ కాత్యాయనీ దేవి ఆరాధన సందర్భంగా రాష్ట్ర మహిళా ప్రజా ప్రతినిధులందరూ గురువారం పసుపు రంగు దుస్తులను ధరించి అసెంబ్లీకి హాజరయ్యారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా పసుపు రంగు దుస్తులు ధరించడం వల్ల సంతోషం, ఆనందం, శుభం లభిస్తాయని మన పూర్వీకులు చెప్పిన మాటలను ఇప్పటి మహిళా ఎమ్మెల్యేలు అక్షరాల పాటించారు. శరన్నవరాత్రులు సందర్భంగా నిత్యం అమ్మ వారికి ఇష్టమైన రంగుల్లోనే మహిళా మంత్రులు సవితా, గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు పల్లె సింధూరరెడ్డి పరిటాల సునీత బండారు శ్రావణి మిర్యాల శిరీష దేవి, గల్లా మాధవి, రెడ్డప్పగారి మాధవి, భూమా అఖిలప్రియ, అదితి విజయలక్ష్మి, నాగ మాధవి, గౌతు శిరీష, దివ్య, గౌతుచరిత, చౌడేశ్వరి, పసుపు రంగు దుస్తులు ధరించి అసెంబ్లీకి రావడం అందరిని ఆకట్టుకుంది. ఇలా రోజు మహిళా ఎమ్మెల్యేలు క్రమం తప్పకుండా దుర్గా దేవి నవరాత్రుల సమయంలో ఇష్టమైన దుస్తుల్లో అసెంబ్లీకి హాజరుకావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని ఈ మహిళా ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

# జీఎస్‌టీ ప్రతిఫలాలను ప్రజలకు అందించండి

**●వ్యాపారులకు టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి సూచన**

**●ఎంపీ వేమిరెడ్డి ఆదేశాలతో నాలుగో రోజు అవగాహన కార్యక్రమం**




నెల్లూరు (చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన జీఎస్‌టీ 2.0 సంస్కరణల ప్రతిఫలాలను వ్యాపారులు సామాన్య ప్రజలకు అందించాలని టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి సూచించారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన జీఎస్‌టీ 2.0 కార్యక్రమంపై అవగాహన నాలుగో రోజుకు చేరుకుంది. గురువారం నెల్లూరు సిటీ పరిధిలోని పెద్ద బజారు సెంటర్‌లో స్థానిక వ్యాపారులకు, ప్రజలకు, దుకాణదారులకు జీఎస్‌టీ 2.0 ద్వారా కలిగే లబ్ధిని వివరించారు. జీఎస్‌టీ అమలుపై స్థానికులకు ఉన్న అపోహలను తొలగించారు.

ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ 2.0 సంస్కరణలు తెచ్చి.. పేద, మధ్య తరగతి ప్రజలపై ధరల భారం తగ్గించిందన్నారు. నిత్యం ఇళ్లలో ఉపయోగించే వస్తువులపై కేంద్రం పన్నులు లేకుండా చేసిందన్నారు. అటు ప్రజలపై భారం తగ్గిస్తూనే.. ఉత్తమ సేవలు అందిస్తూ జీవన ప్రమాణాలు పెంచుతోందని అన్నారు. జీఎస్టీ ద్వారా వచ్చిన పన్నులను రోడ్లు, రైల్వేలు, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్రం ఖర్చు చేస్తోందని చెప్పారు. జీఎస్‌టీ ద్వారా దాదాపు 2 లక్షల కోట్ల ప్రజా ధనం మార్కెట్‌లోకి వస్తుందని కేంద్రం అంచనా వేసిందని, దీని ద్వారా నగదు చలామణీ పెరుగుతుందని అన్నారు.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని కేతంరెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. తమను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు మంచి చేయాలన్న సంకల్పంతో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నారని చెప్పారు. అలాగే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి నారాయణ సహకారంతో నెల్లూరు సిటీతో పాటు జిల్లా అభివృద్ధి దిశగా పయనిస్తోందని వివరించారు. జీఎస్‌టీ ద్వారా కలుగుతున్న లబ్ధిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలకు తమ మద్దతు ఇలాగే కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో 42, 43 డివిజన్ల క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఎండి జాఫర్ షరీఫ్, 43 డివిజన్ టిడిపి అధ్యక్షులు షేక్ జమీర్, టిడిపి మైనారిటీ నాయకులు న్యామతుల్లా, సయ్యద్ నౌషాద్, షేక్ ఫజల్ అహమద్, సయ్యద్ ముజహర్, డేవిడ్ జాన్, మహిళా క్లస్టర్ ఇంచార్జ్ గౌసున్నిసా, సుబహాని, ఖాదర్ బాష, వినయ్, కుక్క ప్రభాకర్, ఝాన్సీ, జవాద్‌లతో పాటు బొందిలి కార్పొరేషన్ మాజీ రాష్ట్ర ఛైర్మన్ కిషోర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన కోవెలకుంట్ల - జమ్మలమడుగు జాతీయ రహదారికి మరమ్మతులు



అమరావతి / కడప (చైతన్యరథం): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఉయ్యాలవాడలోని మండలంలోని కోవెలకుంట్ల – జమ్మలమడుగు జాతీయ రహదారిలో రూపనగుడి గ్రామ చెరువు అలుగు వద్ద రహదారి దారుణంగా దెబ్బతింది. ఈ విషయంపై స్పందించిన మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్డుపై తారు, కంకర లేచిపోయి పెద్ద పెద్ద గుంతలు పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో తక్షణమే కోవెలకుంట్ల – జమ్మలమడుగు జాతీయ రహదారిలో మరమ్మతు పనులు చేపట్టాలని మంత్రి దేశించారు. మంత్రి ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన స్పందించి.. మకాడమ్ వెట్ మిక్స్‌తో రహదారి మరమ్మతులు చేపట్టాలన్నారు. అమరావతిలో అసెంబ్లీ సమావేశాలతో తీరిక లేకుండా ఉన్నప్పటికీ, జిల్లాలోని రహదారి సమస్యపై మంత్రి తక్షణం స్పందించడం.. అందుకు అనుగుణంగా వెనువెంటనే మరమ్మతులు పూర్తి చేయడంపై స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# మెగా డీఎస్సీ సూపర్‌హిట్ చేసి చూపించాం : నక్కా ఆనందబాబు



అమరావతి (చైతన్యరథం): అమరావతి సచివాలయ ప్రాంగణంలో గురువారం ఘనంగా నిర్వహించిన మెగా డీఎస్సీ ఉత్సవంలో మాజీ మంత్రి వేమూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మొత్తం 15,941 మంది అభ్యర్థులు టీచర్లుగా ఎంపికై నియామక పత్రాలు స్వీకరించారు. విజేతలకు స్వయంగా నియామక పత్రాలను నక్కా ఆనందబాబు అందజేశారు. 1994 నుంచి 2025 వరకు 14 డీఎస్సీలు నిర్వహించి 1,96,619 టీచర్ పోస్టులను భర్తీ చేసిన ఘనత సీఎం చంద్రబాబుదని, అధికారంలోకి రాగానే తొలిసంతకం మెగా డీఎస్సీ ఫైల్‌పైనే చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, బీజేపీ చీఫ్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు. విజేతలకు నియామక పత్రాలు అందజేయడం ద్వారా రాష్ట్ర విద్యా వ్యవస్థలో కొత్త ఉత్సాహం నింపబడిందని నక్కా ఆనందబాబు తెలిపారు.

# కార్యకర్త కుటుంబానికి అండగా నిలవండి : నరసింహయాదవ్


తిరుపతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ గురువారం తిరుపతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల కన్నుమూసిన తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయం కార్యదర్శి మనోహర్ ఆచారి కుటుంబానికి ప్రభుత్వపరంగా సహాయం అందించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. మనోహర్ ఆచారి దీర్ఘకాల సేవలను గుర్తుచేసుకుంటూ, ఆయన పార్టీ పట్ల చూపిన నిబద్ధతను నరసింహ యాదవ్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. కుటుంబానికి తగిన ఆర్థిక, సామాజిక రీతుల్లో ప్రభుత్వం అండగా నిలవాలని, ముఖ్యంగా వారి కుటుంబ సభ్యుల భవిష్యత్తు కోసం సకాలంలో సహాయక చర్యలు తీసుకోవాలని ఆయన ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. నరసింహాయాదవ్ వినతిని స్వీకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మనోహర్ ఆచారి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



# అణుశక్తి, గ్రీన్‌ఎనర్జీ ప్రాజెక్టులకు మోదీ శ్రీకారం

**- రాజస్థాన్‌లో రూ.1.22 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
**-దీన్‌దయాళ్ జయంతి ఉత్సవాలు**

రాజస్థాన్: భారత ప్రధాని నరేంద్ర మోదీ రాజస్థాన్‌లో రూ.1,22,100 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఈ ఉదయం రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మతో కలిసి పీటీ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి ఉత్సవాల్లో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ.. దీన్ దయాల్‌కు పుష్పాంజలి ఘటించారు. అనంతరం రాష్ట్రంలో నిర్మించిన, నిర్మించబోతోన్న ప్రధాన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వీటిలో మహీ బన్స్వారా అణుశక్తి ప్రాజెక్టు కీలకమైంది. ఇది రూ.42,000 కోట్ల బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఇందులో నాలుగు 700 మెగావాట్ ప్రెషరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్లు ఉంటాయి. ఇవి ఎన్‌పీసీఐఎల్ డిజైన్‌లో అధునాతన భద్రతా ప్రమాణాలతో భారత్‌లో తయారుకావడం విశేషం. 'ఫ్లీట్ మోడ్' చొరవతో ఇలాంటి 10 రియాక్టర్లను భారత్ నిర్మిస్తోంది. ఇది చవకైన, సురక్షితమైన, స్థిరమైన విద్యుత్ సరఫరాను అందిస్తుంది. అంతేకాక పర్యావరణ పరిరక్షణ, అణుశక్తి రంగానికి ఇది ఎంతగానో ఊతమిస్తుంది. దీంతోపాటు, రూ.19,210 కోట్ల విలువైన గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను కూడా మోదీ నేడు రాజస్థాన్‌లో ప్రారంభించారు. ఫలోడీ, జైసల్మేర్, జాలోర్, సీకర్‌లో సోలార్ ప్రాజెక్టులను ప్రారంభించి బికానీర్‌లో మరొక సోలార్ ప్రాజెక్టుకు పునాది రాయి వేశారు. ఇవి భారతదేశాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, భారత శక్తి సామర్థ్యాన్ని పెంచి, కోట్లాది టన్నుల సీవో2 ఉద్గారాలను నిరోధిస్తాయి. ఈ ప్రాజెక్టులు దేశ స్థిరమైన అభివృద్ధి, పర్యావరణ లక్ష్యాలకు కట్టుబడి ఉన్నాయని, ఇవి.. దేశ భవిష్యత్తును మార్చుతాయని మోదీ చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాజస్థాన్ ముఖ్యమంత్రి.. రాష్ట్రంలో అభివృద్ధి త్వరగా జరుగుతుందని, ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో ఉపాధి, ఆర్థిక వ్యవస్థలు బలపడతాయని భజన్‌లాల్ శర్మ అన్నారు.



## ఉత్తర్‌ప్రదేశ్‌ను డిఫెన్స్ హబ్‌గా మారుస్తున్నాం

నోయిడా: ఉత్తర్‌ప్రదేశ్‌లో భారత రక్షణరంగ ఉత్పత్తుల్ని మరింత బలోపేతం చేస్తూ ఏకే-203 రైఫిల్స్ తయారీ త్వరలో ప్రారంభం కానుందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. గురువారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన (యూపీఐటీఎస్-2025) సందర్భంగా మాట్లాడిన మోదీ.. భారత సైన్యం స్వయం సమృద్ధి (ఆత్మనిర్భర్) లక్ష్యంతో విదేశీ ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించాలని కోరుకుంటున్నట్టు చెప్పారు.



## లిక్కర్ స్కామ్‌లో మాజీ సీఎం కొడుకు అరెస్ట్

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన భారీ లిక్కర్ స్కామ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ కొడుకు చైతన్య బఘేల్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో అంటి కరప్షన్ బ్యూరో, ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్ బుధవారం చైతన్యతో పాటు మరో వ్యక్తి దీపెన్ చావ్డాను కూడా అదుపులోకి తీసుకున్నాయి. ఇద్దరినీ ప్రత్యేక ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ కోర్టులో హాజరుపరిచారు, అక్టోబర్ 6 వరకు వారిని ఏసీబీ/ఈఓడబ్ల్యూ కస్టడీకి అప్పగించారు. 2019 నుంచి 2022 వరకు భూపేశ్ బఘేల్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ లిక్కర్ స్కామ్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ స్కామ్ విలువ దాదాపు 2,500 కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకారం, చైతన్య బఘేల్ ఈ స్కామ్‌లో కీలక పాత్ర పోషించారు. ఈ కుంభకోణంలో సుమారు 1,000 కోట్ల రూపాయల అక్రమ ఆదాయాన్ని చైతన్య నిర్వహించినట్లు ఈడీ ఆరోపిస్తోంది. అక్రమ నిధులను దాచడానికి, బదిలీ చేయడానికి ఇతర సభ్యులతో కలిసి కుట్ర పన్నినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ స్కామ్‌లో మద్యం అమ్మకాల నుంచి కమీషన్లు, చట్టవిరుద్ధమైన మద్యం అమ్మకాల ఆదాయం, రాష్ట్రంలో లాభదాయకమైన మద్యం వ్యాపారాన్ని నియంత్రించేందుకు డిస్టిలర్లతో కుమ్మక్కై లంచాలు తీసుకోవడం వంటివి ఉన్నాయి.

## హిందుస్తాన్ ఏరోనాటిక్స్‌తో రూ.62 వేల కోట్ల ఒప్పందం

న్యూ ఢిల్లీ: భారత రక్షణ మంత్రిత్వ శాఖ, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌తో రూ.62,370 కోట్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా భారత వాయుసేనకు 97 ఎల్‌సీఏ తేజస్, ఎంకే1ఏ ఫైటర్ జెట్ విమానాలు (68 సింగిల్-సీటర్లు, 29 రెండు-సీటర్ ట్రైనర్లు) సమకూరనున్నాయి. స్వదేశీ టెక్నాలజీతో తయారైన తేజస్ జెట్ విమానాలు అధునాతన యూటీటీఏఎం ఏఈఎస్ఏ రాడార్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సూట్‌లతో రూపొందాయి. 64 శాతం స్వదేశీ కంటెంట్‌తో, 67 అదనపు భారతీయ కంటెంట్ ఈ జెట్లలో ఉన్నాయి. ఈ భారీ ప్రాజెక్టులో 105 భారతీయ కంపెనీలు పాల్గొంటున్నాయి. ఫలితంగా దేశంలో సంవత్సరానికి 11,750 ఉద్యోగాలు సృష్టించబడతాయని అంచనా. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి ఊతమిచ్చే ఈ ఒప్పందం తాలూకూ డెలివరీలు 2027-28 నుంచి ఆరేళ్లలో పూర్తవుతాయి. ఈ చారిత్రక డీల్ భారత వాయుసేన శక్తిని బలోపేతం చేయడమే కాకుండా, దేశీయ రక్షణ ఉత్పత్తిని, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తుంది.

# రైలు పైనుంచి అగ్ని ప్రైమ్ క్షిపణి ప్రయోగం


భారత్ ఆయుధ శక్తి మరో కీలక ముందడుగు వేసింది. తొలిసారి రైలు పైనుంచి బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించే సామర్థ్యాన్ని పరీక్షించింది. ఈ విషయాన్ని డీఆర్డీవో, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. అణుసామర్థ్యం ఉన్న అగ్ని ప్రైమ్ క్షిపణిని దీనిపైనుంచి ప్రయోగించినట్లు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. ఆయన రక్షణ పరిశోధనాభివద్ధి సంస్థ (డీఆర్డీవో)ను అభినందించారు. అతితక్కువ సమయంలో అవసరమైన చోటుకు తరలించి ప్రయోగించేలా రైలు ఆధారిత మొబైల్ లాంఛింగ్ వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. "ప్రత్యేకంగా డిజైన్ చేసిన రైల్ బేస్డ్ మొబైల్ లాంఛర్ నుంచి



తొలిసారి క్షిపణి ప్రయోగం చేపట్టాం. రైల్ నెట్వర్క్ సాయంతో ఎటువంటి ముందస్తు ఏర్పాట్లు లేకుండా దేశంలో ఎక్కడికైనా వేగంగా తరలించి.. తక్కువ రియాక్షన్ టైమ్లో శత్రువు కంటపడకుండా ప్రయోగించవచ్చు" అని పేర్కొన్నారు. ఇక అగ్ని ప్రైమ్ మిసైల్‌లో చాలా అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయి. ఇది భారత రక్షణకు అదనపు బలాన్ని చేకూరుస్తుంది. దీనిలో రింగ్ లేజర్ గైరో ఆధారిత ఇనర్షల్ నేవిగేషన్, మైక్రో ఇనర్షల్ నేవిగేషన్ సిస్టమ్లను అమర్చారు. దీంతోపాటు జీపీఎస్, నావిక్ శాటిలైట్ నేవిగేషన్లకు కూడా దీన్ని వాడుకొనే ఆప్షన్ ఉంది. ఇక ఈ మిసైల్‌కు ఉన్న కెనిస్టర్ డిజైన్ కారణంగా తేలిగ్గా ఎక్కడికైనా రవాణా చేసి భద్రపరచవచ్చు. ఇది లాంచింగ్‌కు అవసరమైన సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఇప్పటికే అగ్ని-పి క్షిపణి పలు టెస్టుల్లో సామర్థ్యాన్ని నిరూపించుకుంది.

# తల్లిదండ్రులను పట్టించుకోకపోతే పిల్లల్ని వెళ్లగొట్టొచ్చు

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలకు వారి ఆస్తులను అనుభవించే హక్కు లేదని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. అలా ప్రవర్తించే సంతానాన్ని బయటకు వెళ్లగొట్టొచ్చని తేల్చిచెప్పింది. బిడ్డల నిరాదరణకు గురయ్యే తల్లిదండ్రులకు 2007లో ప్రభుత్వం తీసుకొచ్చిన 'తల్లిదండ్రుల, వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం' అండగా నిలుస్తుందని వ్యాఖ్యానించింది. కుమారుడు తమ సంరక్షణ బాధ్యతలు చూసుకోవడం లేదంటూ మహారాష్ట్రకు చెందిన 80 ఏళ్ల వృద్ధ జంట సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ఈ తీర్పు వెలువడింది. 2023లో ఈ వృద్ధ జంట కుమారుడి నుంచి పోషణ ఖర్చులు, అలాగే తమ ఆస్తులు తమకు చెందేలా చూడాలని కోరుతూ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. వారి అభ్యర్థనను పరిశీలించిన ట్రైబ్యునల్.. నెలకు రూ.3000 ఇవ్వాలని, అలాగే



ముంబయిలోని వారి ఇంటిని ఖాళీ చేయాలని తీర్పునిచ్చింది. అయితే ముంబయి హైకోర్టు ఆ తీర్పును తోసిపుచ్చింది. 2007 చట్టం ప్రకారం ఆ కుమారుడు కూడా సీనియర్ సిటిజన్ కావడంతో అతడిని ఇంటి నుంచి వెళ్లగొట్టేలా ఆదేశాలు ఇచ్చే న్యాయ పరిధి దానికి లేదని పేర్కొంది. అయితే హైకోర్టు పరిగణనలోకి తీసుకున్న కారణం తప్పని సుప్రీం అభిప్రాయం వ్యక్తం చేసింది. ట్రైబ్యునల్ తీర్పును సమర్థించింది. నవంబర్ 30లోగా ఆ కుమారుడు ఇంటిని ఖాళీ చేయాలని గడువు ఇచ్చింది. గతంలోనూ కోర్టు ఈ తరహా తీర్పునిచ్చింది. జన్మనిచ్చిన తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ బాధ్యత వారి కుమారులు, కుమార్తెలదేనని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఆ బాధ్యతను విస్మరించిన వారికి కన్నవారి ఆస్తిని పొందే హక్కులేదని తేల్చి చెప్పింది. వృద్ధాప్యంలో అమ్మానాన్నల బాగోగులన్నీ చూసుకుంటానని హామీనిచ్చి, వారి నుంచి ఆస్తి పొందిన కుమారుడు మాట తప్పడంతో మధ్యప్రదేశ్‌కు చెందిన తల్లిదండ్రులు సుప్రీంను ఆశ్రయించారు. ఆ కుమారుడికి ఇచ్చిన గిఫ్ట్ డీడ్ను రద్దుచేసి ఆ ఆస్తిపై వృద్ధుల హక్కును పునరుద్ధరించింది. తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ చట్టం ప్రకారం.. ఏర్పాటైన ట్రైబ్యునళ్లు... కన్నవారిని పట్టించుకోని బిడ్డల విషయంలో సత్వర విచారణ జరుపుతాయని తెలిపింది. ఇలాంటి వివాదాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు బదిలీ చేసిన ఆస్తిపై యాజమాన్య హక్కులు తిరిగి బాధితులకే దక్కేలా ఆదేశించే అధికారం ఆ ట్రైబ్యునళ్లకు ఉంటుందని ధర్మాసనం స్పష్టంచేసింది.

# బేబీ అంటూ మెసేజ్‌లు..ఆ తర్వాత బెదిరింపులు

## ◆ ఢిల్లీ బాబాపై విచారణలో షాకింగ్ వాస్తవాలు

ఢిల్లీలోని ప్రముఖ ఆశ్రమానికి చెందిన స్వామి చైతన్యానంద సరస్వతిపై లైంగికారోపణల కేసులో పోలీసులు విస్తృత దర్యాప్తు చేస్తున్నారు. వసంత్ కుంజ్ ప్రాంతంలోని శ్రీ శారద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థినులను ఆయన వేధించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. కాలేజీలో చదువుకుంటున్న తమను స్వామి చైతన్యానంద సరస్వతి వేధించినట్టు పలువురు విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. తమపై బెదిరింపులకు దిగేవారని కూడా కొందరు ఆరోపించారు. ఆగస్టులో దాఖలైన ఈ ఎఫ్ఐఆర్‌లో బాధితులు.. తమకు బాబా పంపిన కొన్ని వాట్సాప్ సందేశాలను కూడా పేర్కొన్నారు. బేబీ.. ఐ లవ్ యూ అంటూ మెసేజీలు వచ్చాయని ఆరోపించారు. తమ రూపురేఖలు ఆహార్యం పై కామెంట్స్ చేసేవాడని అన్నారు. ఈ షాకింగ్ విషయాలు విచారణలో బయట పడ్డాయని అధికారులు ధ్రువీకరించారు. గతేడాది అక్టోబర్‌లో తొలిసారిగా బాబాపై ఆరోపణలు మొదలయ్యాయి. గత డిసెంబర్‌లో ఓ విద్యార్థినికి ఎముక విరిగితే, ఇందుకు సంబంధించిన ఎక్స్ రే రిపోర్టు కావాలని బాబా బలవంతం చేశాడు. ఆ తరువాత అసభ్యకర మెసేజీలు కూడా పెట్టాడు. ఆ తరువాత ఈ ఏడాది మార్చ్‌లో కొత్త కారుకు పూజ పేరిట తనను పిలిపించాడని, ఆ రాత్రి తనను ఒంటరిగా కలవాలని మెసేజ్ పెట్టాడని ఆ యువతి ఆరోపించింది. తాను చెప్పినట్టు చేయకపోతే మార్కులు తగ్గిస్తామని కూడా బాబా బెదిరింపులకు దిగాడని



విద్యార్థినులు ఆరోపించారు. హోలీ సందర్భంగా మొదట తనపైనే రంగులు జల్లాలని తమను వేధించాడని అన్నారు. ఇటీవల జూన్‌లో రిషికేశ్ పర్యటన సందర్భంగా ఎప్పుడపడితే అప్పు డు తమను పిలిపించుకుని వేధించేవారని అన్నారు. ఇందుకు అంగీకరించని వారి మార్కులు తగ్గించారని, పరీక్షలు రాయ కుండా అడ్డుకున్నారని ఆరోపించారు. ఇక కాలేజీకి చెందిన శ్వేత, భావన, కాజల్ అనే సిబ్బందిపై కూడా ఓ విద్యార్థిని ఆరోపించింది. పాత మెసేజీలు డిలీట్ చేయాలని వారు తనను బలవంతం చేశారని, క్షమాపణలు చెబుతూ ఈ మెయిల్ రాయాలని బలవంతం చేసి నట్టు పేర్కొంది. బాబాపై మొత్తం 32 విద్యార్థినులు వాంగ్మూలాలు ఇవ్వగా వారిలో 17 మంది లైంగిక ఆరోపణలు చేశారు.

# హెచ్-1బీ రగడపై లీగల్ ఫైట్?

## సమాయత్తమవుతున్న యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్?




హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకొన్న నిర్ణయంపై న్యాయపోరాటం చేసే అంశాన్ని ఆ దేశ ఛాంబర్ ఆఫ్ కామర్స్ పరిశీలిస్తోంది. ఈ విషయాన్ని బ్లూమ్‌బెర్గ్ పత్రిక కథనంలో పేర్కొంది. ఈ పోరాటానికి ఎన్ని కంపెనీలు మద్దతిస్తాయనే దానిపై ఓ అవగాహనకు వచ్చేందుకు ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో సభ్యత్వం ఉన్న కంపెనీలతో టెలిఫోన్, వర్చువల్ మీటింగ్‌లో చర్చిస్తోంది. హెచ్-1బీ వీసాలను అధికంగా వినియోగించే టెక్ కంపెనీలు ట్రంప్ నిర్ణయంతో ఇబ్బందిపడుతున్న విషయాన్ని ఇది సూచిస్తోంది. 2020లో నాన్ ఇమిగ్రెంట్ వీసాల జారీని నిలిపివేయాలన్న నిర్ణయాన్ని కూడా యూఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ కోర్టులో సవాల్ చేసి విజయం సాధించింది. తాజాగా ఛాంబర్ ప్రతినిధి మాట్ లెటోర్నో మాట్లాడుతూ "మా సభ్యుల ఆందోళనలు నిరంతరం మా వద్దకు చేరుతున్నాయి. ఈవిషయాన్ని అడ్మినిస్ట్రేషన్ దృష్టికి తీసుకువెళతాం. ప్రస్తుతం హెచ్-1బీ వీసాల ఫీజు పెంపువల్లే.. ప్రస్తుత వీసాదారులపైనా ఆయన ప్రకటన చేయవచ్చనే ఆందోళనలు నెలకొన్నాయి. అయితే ట్రంప్ కార్యవర్గం కొన్నింటిపై స్పష్టతలు ఇచ్చినందుకు ధన్యవాదాలు" అని పేర్కొన్నారు. హెచ్-1బీ వీసాల ఫీజుల పెంపుపై ట్రంప్ చేసిన ప్రకటనకు ఉన్న చట్టబద్ధత ప్రశ్నార్థకంగా మారింది. ఫెడరల్ ఇమిగ్రేషన్ చట్టం యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్ ఫీజు వసూలు చేసేందుకు అనుమతించింది. అది కూడా దాని ఖర్చులకు సరిపోయేంత మాత్రమే. గతంలో ఉన్న ఫీజు విధానాన్ని కాంగ్రెస్ ఆమోదించింది. అవసరమైనప్పుడు దానిని సవరిస్తోంది. దీన్నిబట్టి హెచ్-1బీ వీసాలపై స్వతంత్రంగా సర్‌ఛార్జి విధించే అధికారం ట్రంప్‌నకు లేదని తెలుస్తోంది.

అయితే దీనిపై ట్రంప్ వాదన భిన్నంగా ఉంది. అమెరికా ప్రయోజనాలకు ప్రమాదకరమని భావించిన విదేశీ వ్యక్తులను నిలువరించే అధికారం తనకుందంటున్నారు. గతంలో కొన్ని ముస్లిం దేశాలపై ట్రావెల్ బ్యాన్ విధించినప్పుడూ ఈ అధికారాన్నే ఆయన వాడుకొన్నట్టు ఆ దేశ సుప్రీంకోర్టులో వాదించారు. నాడు న్యాయస్థానం దానిని సమర్థించింది. అయితే హెచ్-1బీ కేసులో జాతీయ భద్రతకంటే ఆర్థిక ప్రయోజనాలే కనపడుతుండటంతో కోర్టులో అది ఏమేరకు నిలుస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది.



# ఆ సంగతి తేల్చండి

### ఐరాసలో ఎదురైన అవమానాలపై సీక్రెట్ సర్వీస్‌కు ట్రంప్ ఆదేశం

ఐరాస జనరల్ అసెంబ్లీలో ప్రసంగించేందుకు వెళ్లే క్రమంలో ఎదురైన చేదు అనుభవాలపై డొనాల్డ్ ట్రంప్ సీరియస్‌గా స్పందించారు. సీక్రెట్ సర్వీస్ దానిపై దర్యాప్తు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈవిషయాన్ని ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. "ఐరాసలో నిన్న నాకు అవమానం జరిగింది. ఒక్కసారి, రెండుసార్లు కాదు... ఏకంగా మూడు దురదృష్టకర ఘటనలు జరిగాయి. తొలుత ఎస్కలేటర్ ఆగిపోయింది. తర్వాత టెలిప్రాంప్టర్ 15 నిమిషాలపాటు మొరాయించింది. అయినా, నా ప్రసంగానికి అద్భుతమైన రివ్యూలు వచ్చాయి" అని పేర్కొన్నారు. ఆడిటోరియంలోని సౌండ్ సిస్టమ్ ఘోరంగా ఉందని ఎద్దేవా చేశారు. తాను మాట్లాడిన తర్వాత భార్య మెలానియా వైపు చూడగా.. ఆమె ఒక్క ముక్క కూడా వినిపించలేదని పేర్కొన్నారు. ఇది ఏదో యాదృచ్ఛికంగా జరిగింది కాదు. ఈ మూడూ ఉద్దేశపూర్వకంగా చేసినవేనని పేర్కొన్నారు. ఈ లోపాలపై దర్యాప్తు చేపట్టాలని ఐరాస సెక్రటరీ జనరల్‌కు లేఖ రాస్తాననన్నారు. దీనిలో సీక్రెట్ సర్వీస్‌ను భాగస్వామి చేయాలన్నారు. అయితే దీనిపై ఐరాస ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ స్పందిస్తూ.. అమెరికా అధ్యక్షుడి బృందంలోని ఓ వీడియో గ్రాఫర్ ట్రంప్-మెలానియాను ఎదుటినుంచి చిత్రీకరిస్తూ ఎస్కలేటర్ సేఫ్టీ వ్యవస్థను పొరబాటున నొక్కి ఉండొచ్చని తమ దర్యాప్తులో భావిస్తున్నామన్నారు. భార్య మెలానియాతో కలిసి సర్వప్రతినిధి సభకు వచ్చిన ట్రంప్.. సమావేశ ప్రాంగణానికి చేరుకునేందుకు ఎస్కలేటర్ ఎక్కారు. వారిద్దరూ అలా అడుగుపెట్టారో, లేదో యంత్రం హఠాత్తుగా ఆగిపోయింది. వారు కాస్త తూలినట్టయ్యారు. దీంతో ఒక్క క్షణం అంతా బిత్తరబోయారు. మెలానియా కాస్త చొరవగా మెట్లెక్కి వెళ్లారు. ఆమె వెంటే ట్రంప్ అడుగులు వేశారు. ఈ విషయాలను సమావేశంలో ఆయన ప్రస్తావించారు. "ఈ రోజు రెండు విషయాలు ప్రతికూలంగా జరిగాయి. ఒకటి చెత్త ఎస్కలేటర్.. రెండోది పనిచేయని టెలిప్రాంప్టర్. థాంక్యూ, వెరీమచ్" అంటూ వ్యంగ్యంగా ప్రసంగాన్ని ప్రారంభించారు. "టెలిప్రాంప్టర్ లేకుండా ప్రసంగించడానికి నాకేమీ ఇబ్బందిలేదు. ఎందుకంటే దీనివల్ల హృదయం లోతులనుంచి మాట్లాడవచ్చు. ఈ ప్రాంప్టర్ని ఆపరేట్ చేస్తున్నవారు పెద్ద సమస్యలో పడ్డారని మాత్రం చెప్పగలను. ఇక ఎస్కలేటర్ మొరాయించింది. నా భార్య మెలానియా లావుగా ఉన్నట్లయితే పడిపోయేదే. ఆమె, నేను చక్కని సౌష్టవంతో ఉన్నాం కాబట్టి నిలబడ్డాం" అని ఆయన చెప్పిన తీరుకు నవ్వులు విరబూశాయి.

# సర్కోజీకి ఐదేళ్ల జైలు

### నియంత గడాఫీతో లాలూచీపడిన ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు


ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికొలస్ సర్కోజీకి ఐదేళ్ల జైలు శిక్ష పడింది. అక్రమ నిధులకు సంబంధించిన కేసును విచారించిన పారిస్‌లోని న్యాయస్థానం ఆయనను దోషిగా తేల్చింది. 2007లో అధ్యక్ష ఎన్నికల సమయంలో గడాఫీ నేతృత్వంలోని లిబియా ప్రభుత్వంనుంచి అక్రమంగా నిధులు తీసుకున్నారన్నది ఆరోపణ. అయితే, వీటిలో కొన్ని అభియోగాలు కొట్టివేయగా.. ఒకదాంట్లో మాత్రం దోషిగా నిర్ధరించిన న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది. దీనిపై సర్కోజీ అప్పీలు చేసుకున్నా.. జైలుకు వెళ్లాల్సిందేనని స్పష్టం చేసింది. అయితే, జైలుకు వెళ్లే తేదీపై నిర్ణయాన్ని మాత్రం తర్వాత వెల్లడిస్తామని న్యాయస్థానం పేర్కొంది. సర్కోజీ 2007 నుంచి 2012 వరకు ఫ్రాన్స్ అధ్యక్షుడిగా ఉన్నారు. అయితే, 2007లో తన అధ్యక్ష ఎన్నికల ప్రచారానికి లిబియా నియంత



గడాఫీ నుంచి భారీగా ఆర్థిక సాయం పొందారని ఆరోపణలు వచ్చాయి. దౌత్య సహాయం అందించేందుకు బదులుగా వీటిని స్వీకరించారనేది అభియోగాలు. అవినీతి, ప్రచారానికి అక్రమ నిధులు, ప్రభుత్వ నిధుల దుర్వినియోగంవంటి ఆరోపణలు రుజువు కానప్పటికీ.. నేరపూరిత కుట్రలో మాత్రం సర్కోజీని న్యాయస్థానం దోషిగా నిర్ధారించి ఐదేళ్ల శిక్ష విధించింది. తీర్పు సమయంలో మాజీ అధ్యక్షుడు సహా ఆయన కుటుంబ సభ్యులు కోర్టు రూంలోనే ఉన్నారు. సర్కోజీ ప్రభుత్వంలో పనిచేసిన ఇద్దరు మంత్రులను న్యాయస్థానం దోషులుగా తేల్చింది. ఎన్నికల ప్రచారానికి లిబియానుంచి నిధులు సమకూర్చేందుకు వీరంతా కలిసి కుట్ర పన్నారని న్యాయస్థానం పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి ఈ ఏడాది ప్రారంభంలో విచారణ జరగ్గా.. ఆయనపై వచ్చిన అభియోగాలను సర్కోజీ ఖండించారు. ఇదిలాఉంటే, అవినీతికి సంబంధించిన మరో కేసులో కూడా సర్కోజీకి గతంలో జైలు శిక్ష పడిన విషయం తెలిసిందే.

# భారత్.. మాకు చాలా ఇష్టం

### ఆ దేశంతో ఇంధన వాణిజ్యంపై ఆసక్తిగా ఉన్నాం: క్రిస్ రైట్



తమ అద్భుత మిత్రదేశమైన భారత్‌తో అమెరికా ఇంధన సహకా రాన్ని విస్తరించు కోవాలని కోరుకుంటు న్నట్టు అగ్రరాజ్య ఇంధన శాఖ మంత్రి క్రిస్ రైట్ వెల్లడించా రు. ఇరు దేశాల మధ్య ఇందన, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారాన్ని బలోపేతం చేసే అంశంపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో చర్చించినట్లు వెల్లడించా రు. న్యూయార్క్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో క్రిస్ రైట్ మాట్లా డుతూ.. రష్యా చమురు కొనుగోలు అంశాన్నీ ఆయన ప్రస్తావించారు. "నేను భారత్‌కు పెద్ద అభిమానిని. ఆ దేశమంటే మాకు చాలా ఇష్టం. ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌తో ఇంధన వాణిజ్యాన్ని మరింత పెంచుకునేందుకు మేం ఎదురుచూస్తున్నాం. అయితే, ప్రస్తుతం ఆ దేశం మరో విషయంలో (రష్యా చమురు కొనుగోలును ఉద్దేశిస్తూ) చిక్కుకుంది" అని క్రిస్ రైట్ అన్నారు. "రష్యానుంచి చమురు కొనుగోలు చేయాల్సిన అవసరం భారత్‌కు లేదు. కానీ, తక్కువ ధరకు లభించడంవల్ల ఆ కొనుగోళ్లు కొనసాగిస్తోంది. కానీ, చమురు విక్రయాలతో వచ్చిన ఆదాయాన్ని రష్యా యుద్ధానికి వినియోగిస్తోంది. అందుకే, అలాంటి దేశంతో వాణి జ్యాన్ని భారత్ ముగించుకుంటే బాగుంటుంది. న్యూఢిల్లీపై పెనాల్టీలు విధించాలని అమెరికా కోరుకోవడం లేదు. కేవలం యుద్ధాన్ని ముగించాలని మాత్రమే చూస్తున్నాం. భారత్ తమ ఇంధన దిగుమతుల గురించి ప్రత్యామ్యాయ మార్గాలను అన్వేషించుకుంటుందని ఆశిస్తున్నాం. న్యూఢిల్లీతో ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నాం" అని అమెరికా మంత్రి వెల్లడించారు.

# "ఎవరు బతకాలో ఆయుధాలు నిర్ణయిస్తున్నాయ్"



ఎవరు బతకాలో ఆయుధాలు నిర్ణయిస్తున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రపంచంలో మానవ చరిత్రలోనే అత్యంత విధ్వంసకరమైన ఆయుధ పోటీ నెలకొందన్నారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభలో మాట్లాడిన ఆయన.. రష్యాకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరారు. ఐరాస సహా ఇతర బలహీన అంతర్జాతీయ సంస్థలు ఉక్రెయిన్, గాజా, సుడాన్‌లో యుద్ధాలను నిలువరించలేకపో యాయని ఎండగట్టారు. "ఎవరు ప్రాణాలతో ఉండాలో ఆయుధాలే నిర్ణయిస్తున్నాయి. ఈ ప్రపంచంలో స్నేహితులు లేకపోతే ఆయుధాలు మాత్రమే ఉంటాయి. ఎలాంటి భద్రతా హామీలు ఉండవు. మాపై యుద్ధాన్ని రష్యా పొడిగిస్తూనే ఉంది. దానిని అంతర్జాతీయ సమాజం ఖండించాలి. పుతిన్‌ను ఇప్పుడు ఆపకపోతే.. ఈ యుద్ధం మరింత విస్తరిస్తుంది. రష్యా డ్రోన్లు యూరప్ అంతటా ఎగురుతున్నాయి" అని జెలెన్ స్కీ హెచ్చరించారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య ప్రారంభించింది. గత మూడేళ్లకు పైగా ఈ యుద్ధం కొనసాగుతూనే ఉంది. దానిని ఆపేందుకు జరుగుతోన్న ప్రయత్నాలు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. ఏకంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రంగంలోకి దిగినా యుద్ధాన్ని ఆపలేకపోతున్నారు.

# సౌదీ గ్రాండ్ ముఫ్తీ అబ్దుల్ అజీజ్ అస్తమయం



సౌదీ అరేబియా సామ్రాజ్యానికి ఇస్లామిక్ వ్యవహారాల సలహాదారుగా దాదాపు రెండు దశాబ్దాలు పనిచేసిన గ్రాండ్ ముఫ్తీ షేక్ అబ్దుల్ అజీజ్ బిన్ అబ్దుల్లా బిన్ మొహమ్మద్ అల్‌షేక్ మృతిచెందారు. సౌదీ అరేబియా సామాజిక సరళీకరణకు కృషిచేసిన ఇస్లామిక్ పండితునిగా ఆయన మన్ననలు పొందారు. గ్రాండ్ ముఫ్తీగా ఆయన సున్నీ ముస్లిం ప్రపంచంలో ప్రముఖ పాత్ర పోషించారు. మత రాజ్యమైన సౌదీ అరేబియాలో మహిళల డ్రైవింగుకు అనుమతి ఇవ్వడాన్ని, సినిమా థియేటర్ల ప్రారంభాన్ని, సామాజిక సరళీకరణను సమర్థించారు. ఇస్లామిక్ స్టేట్, అల్‌ఖైదావంటి ఉగ్రవాద సంస్థల కార్యకలాపాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. "ఆయన మరణంతో ఇస్లామిక్ ప్రపంచం ఒక గొప్ప జ్ఞానిని కోల్పోయింది" అని సౌదీ అరేబియా రాజాస్థానం ఒక ప్రకటనలో వెల్లడించింది. షేక్ అబ్దుల్ అజీజ్‌ను సౌదీ రాజు ఫహద్ 1999లో గ్రాండ్ ముఫ్తీగా నియమించారు.

**మోదీ సంతాపం**

సౌదీ అరేబియా గ్రాండ్ ముఫ్తీ షేక్ అబ్దుల్ అజీజ్ మృతిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంతాపం వ్యక్తంచేశారు. "గ్రాండ్ ముఫ్తీ మరణంపై ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను. ఈ బాధాకర ఘడియాలో మన ఆలోచనలు, ప్రార్థనలు సౌదీ అరేబియా రాజ్యం,



## విండీస్‌తో టెస్ట్ సిరీస్..

# భారత జట్టు ప్రకటన

**- వైస్ కెప్టెన్‌గా జడేజా, జగదీశన్‌కు అవకాశం**



వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌కు భారత క్రికెట్ జట్టును ప్రకటించారు. ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ నాలుగో సీజన్‌లో భారత్ తొలిసారి స్వదేశంలో టెస్టు సిరీస్ ఆడనుంది. వెస్టిండీస్‌తో అక్టోబర్ 2 నుంచి అక్టోబర్ 14 వరకు రెండు టెస్టుల సిరీస్ జరగనుంది.

ప్రస్తుతం టీమ్ ఇండియా దుబాయ్ వేదికగా ఆసియా కప్‌లో తలపడుతోంది. అక్కడే భారత టెస్టు జట్టుసారథి శుభ్‌మన్ గిల్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తో చీఫ్ సెల్కక్టర్ అజిత్ అగార్కర్ సమావేశం నిర్వహించారు. అనంతరం టీమ్ ఇండియా జట్టును ప్రకటించారు. ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌తో గాయపడిన రిషబ్ పంత్ స్థానంలో ఎన్.జగదీశన్‌కు అవకాశం వచ్చింది. అలాగే వైస్ కెప్టెన్‌గా రవీంద్ర జడేజాను నియమించారు.

**కరుణ్, శార్దూల్‌కు దక్కని చోటు**

ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లో ఆడిన కరుణ్ నాయర్, శార్దూల్ ఠాకూర్‌ను సెలక్షన్ కమిటీ పక్కన పెట్టింది. ఆ పర్యటనలో వీరిద్దరు రాణించకపోవటమే కారణంగా తెలుస్తోంది. కరుణ్ నాయర్ బదులు దేవదత్ పడిక్కల్ జట్టులోకి వచ్చాడు. రిషబ్ పంత్ లేకపోవడంతో ధ్రువ్ జురెల్‌కు బ్యాకప్ కీపర్‌గా దేశవాళీలో అదరగొట్టిన జగదీశన్‌కు ఛాన్స్ దక్కింది.

జట్టు ఎంపికపై చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ కీలక వ్యాఖ్యలు చేశారు. నితీశ్ కుమార్ రెడ్డి గత సిరీస్‌లో చాలా అద్భుతంగా ఆడాడు. అతడికి మరిన్ని అవకాశాలు ఇస్తే మెరుగ్గా రాణించే అవకాశం ఉంది. అతడిపై భారీగానే అంచనాలు పెట్టుకున్నాం. ఇషాన్ కిషన్‌ను మేం భారత్ ఏ తరపున ఎంపిక చేసే సమయంలో అతను ఫిట్‌గా లేడు. ఇప్పుడు ఓకే. అయితే. దేశవాళీలో మరిన్ని మ్యాచులు ఆడితే బాగుంటుందనే ఉద్దేశంతో తీసుకోలేదు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా వర్క్ లోడ్‌పై ఫిజియోలతో చర్చించాం. ఏదైనా సరే జట్టే తొలి ప్రాధాన్యం. తప్పకుండా బుమ్రా అద్భుతంగా రాణిస్తాడనే నమ్మకం ఉంది.

రెండు టెస్టులకూ అందుబాటులో ఉంటాడు. షమీ ఫిట్‌నెస్‌పై మాకు ఇంకా అప్డేట్ రాలేదు. భారత్ తరపున మరింత క్రికెట్ ఆడే సత్తా అతడిలో ఉంది. కరుణ్ నాయర్ నుంచి మేం చాలా ఆశించాం. కానీ, అతడు అంచనాలను అందుకోలేకపోయాడు. పడిక్కల్ ఆస్ట్రేలియాలో బాగానే ఆడాడు. ధర్మశాలలో ఇంగ్లాండ్‌పై హాఫ్ సెంచరీ కొట్టాడు. తప్పకుండా అదే ఫామ్ కొనసాగిస్తాడని ఆశిస్తున్నామని అగార్కర్ వెల్లడించాడు.

**భారత స్క్వాడ్ ఇదే**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా (వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీశ్, జగదీశన్, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్

వెస్టిండీస్: కెవ్లాన్ అండర్సన్, బ్రాండన్ కింగ్, అలిక్ అథనాజ్, త్యాగనరైన్ చంద్రపాల్, జాన్ క్యాంప్బెల్, జస్టిన్ గ్రీవ్స్, రోస్టన్ ఛేజ్ (కెప్టెన్), టెవిన్ ఇమ్లాచ్, షై హోప్, షమార్ జోసెఫ్, అండర్సన్ ఫిలిప్, జైడెన్ సీలెస్, ఖారీ పిర్రె,

# పాక్ ఆటగాళ్లపై ఐసీసీకి భారత్ ఫిర్యాదు




ఆసియా కప్ సూపర్ -4 మ్యాచ్‌లో రెచ్చగొట్టేలా హావభావాలు ప్రదర్శించిన పాకిస్థాన్ ఆటగాళ్లపై ఇప్పటికే తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. తాజాగా వారిద్దరిపై భారత క్రికెట్ బోర్డు చర్యలకు ఉపక్రమించింది. ఈ విషయాన్ని ఐసీసీ దృష్టికి తీసుకెళ్లింది. ఈ-మెయిల్ రూపంలో ఐసీసీకి బీసీసీఐ ఫిర్యాదు చేసింది. దీనిపై పాక్ ప్లేయర్లు హారిస్ రవూఫ్, సాహిబ్‌జాదా ఫర్హాన్ నుంచి ఐసీసీ లిఖితపూర్వక వివరణ కోరే అవకాశం ఉంది. వారు ఇవ్వనిపక్షంలో ఐసీసీ ఎలైట్ ప్యానెల్ రిఫరీ రిచీ రిచర్డ్సన్ ఎదుట వాదనలు వినిపించాల్సిన అవసరం ఉంది. భారత్‌తో మ్యాచ్‌లో పాక్ బ్యాటర్ ఫర్హాన్ హాఫ్ సెంచరీ చేసిన తర్వాత బ్యాటును ఏకే 47లా పట్టుకుని బులెట్లు కాలుస్తున్నట్లు సంబరాలు చేసుకున్నాడు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి చేష్టలకు పాల్పడటం విమర్శలకు దారితీసింది. అయితే తన చర్యను ఫర్హాన్ సమర్థించుకొనేందుకు ప్రయత్నం చాడు. 'అప్పటికప్పుడు అలా సంబరాలు చేసుకున్నా. బయట ఎవరు ఏమను కున్నా పట్టించుకోను" అని వ్యాఖ్యానించాడు. ఇక హారిస్ రవూఫ్ అయితే ఏకంగా భారత 'జెట్ ఫైట్'లు కూలినట్లు 6-0 అని సైగలు చూపించాడు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు చెందిన ఆరు ఫైటర్ జెట్ విమానాలను తమ సైన్యం కూల్చేసిందని పాక్ ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. దానిని గుర్తు చేసేలా హారిస్ 'చేష్టలు' ఉన్నాయనేది ప్రధాన విమర్శ. ఇక భారత ఓపెనర్లు అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్‌తో వాగ్వాదానికి కూడా దిగాడు.

**సూర్యపై పీసీబీ కంప్లైంట్**

ఇప్పటికే రిఫరీ విషయంలో అవమానాలు ఎదుర్కొన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు భారత్‌పై అక్కసును మాత్రం వదలట్లేదు. టీమ్ ఇండియా సారథి సూర్యకుమార్ యాదవ్‌పై ఐసీసీకి పీసీబీ ఫిర్యాదు చేసింది. గ్రూప్ స్టేజ్‌లో పాకిస్థాన్‌పై భారత్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఆ గెలుపును పహల్గాం ఉగ్రదాడి బాధితులు, భారత సైన్యానికి అంకితం ఇస్తున్నట్లు సూర్య వెల్లడించాడు. ఇప్పుడు అదే పాక్ కడుపు మంటకు కారణమైంది. సూర్య వ్యాఖ్యలు రాజకీయపరంగా ఉన్నాయంటూ ఐసీసీ దృష్టికి పీసీబీ తీసుకెళ్లింది. అయితే, ఐసీసీ రూల్ ప్రకారం ఎవరైనా ఆటగాడు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే.. ఘటన జరిగిన ఏడు రోజుల్లోపు ఫిర్యాదు చేయాలి. కాబట్టి పీసీబీ ఫిర్యాదును ఐసీసీ తిరస్కరించవచ్చు.

# కుల్దీప్ యాదవ్ మరో ఘనత




ఆసియా కప్ -2025 టోర్నీలో టాప్ బౌలర్‌గా కొనసాగుతోన్న కుల్దీప్ యాదవ్ మరో ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం ఐదు మ్యాచుల్లో 12 వికెట్లు పడగొట్టాడు. తాజాగా బంగ్లాదేశ్ పైనా మూడు వికెట్లు తీసి సత్తా చాటాడు. ఈ క్రమంలో ఆసియా కప్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా కుల్దీప్ నిలిచాడు. ఈ జాబితాలో ఇప్పటివరకు టీమ్ ఇండియా తరపున రవీంద్ర జడేజా (29) ముందున్నాడు. ఆసియా కప్ వన్డే, టీ20 ఫార్మాట్లో జరిగింది. వన్డేల్లో 19 వికెట్లు, టీ20 ఫార్మాట్‌లో 12 వికెట్లను కుల్దీప్ (31) తీశాడు. జడేజా ఎక్కువగా వన్డే ఫార్మాట్లోనే 25 వికెట్లు తీయగా.. టీ20ల్లో నాలుగు మాత్రమే పడగొట్టాడు. ఓవరాల్‌గా కుల్దీప్ రెండో స్థానంలో నిలిచాడు. శ్రీలంక పేసర్ లసిత్ మలింగ 33 వికెట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. కుల్దీప్ తర్వాత శ్రీలంక స్పిన్ దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ (30) ఉన్నాడు.

**ఒకే ఎడిషన్ లో టాప్ వికెట్ టేకర్ ..**

ప్రస్తుత టోర్నీలో కుల్దీప్ 5 మ్యాచుల్లోనే 12 వికెట్లు తీశాడు. దీంతో ఒకే ఎడిషన్‌లో అత్యధిక వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా నిలిచాడు. భువనేశ్వర్ కుమార్ 2022లో 11 వికెట్లు తీయగా.. ఇప్పుడు దానిని కుల్దీప్ అధిగమించా డు. మొత్తమ్మీద మరో వికెట్ తీస్తే కుల్దీప్ అగ్రస్థానంలో నిలుస్తాడు. యూఏఈ ఆటగాడు అమ్జద్ జావెద్ 2016లో ఏడు మ్యాచుల్లో 12 వికెట్లు పడగొట్టాడు. ఇంకా శ్రీలంకతో ఒక మ్యాచ్‌తో పాటు ఫైనల్లో కూడా భారత్ ఆడనున్న నేపథ్యంలో కుల్దీప్ నెంబర్ వన్ స్థానానికి చేరుకోవటంపెద్ద కష్టమేం కాదు.

## ఆస్ట్రేలియా- ఏతో వన్డే సిరీస్..

# కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్



ఓవైపు ఆస్ట్రేలియా ఏ తో అనధికారిక టెస్టు సిరీస్ జరుగుతుండగానే.. వన్డే సిరీసుకు భారత ఏ జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. ఈ నెల 30 నుంచి మూడు వన్డేల సిరీస్ మొదలుకానుంది. మూడు మ్యాచులు కాన్పూర్ వేదికగానే జరుగుతాయి. సుదీర్ఘ ఫార్మాట్‌కు దూరంగా ఉన్న శ్రేయస్ అయ్యర్ మళ్లీ వన్డే జట్టులోకి వచ్చేశాడు. అతడినే సారథిగా నియమించడం గమనార్హం. అనధికారిక టెస్టు సిరీస్‌కూ తొలుత శ్రేయస్‌నే కెప్టెన్‌గా నియమించినా తొలి మ్యాచ్‌లో పెద్దగా రాణించలేదు. దీంతో రెండో టెస్టుకు దూరంగా ఉన్నాడు. అతడి స్థానంలో ధ్రువ్ జురెల్‌కు కెప్టెన్సీ ఛాన్స్ వచ్చింది. శ్రేయస్ ఇప్పుడు మళ్లీ వన్డేలు ఆడేందుకు సిద్ధమయ్యాడు. రెండు, మూడు వన్డేలకు తిలక్ వర్మ అందుబాటులో ఉంటాడు. అతడిని వైస్ కెప్టెన్‌గా నియమించారు. ఆసియా కప్ లో ఆడుతోన్న తిలక్ తోపాటు అర్షదీప్, హర్షిత్ రాణా కూడా అనధికారిక వన్డే సిరీస్‌లో పాల్గొంటారు.

**వన్డే సిరీస్ కు జట్టు**

తొలి మ్యాచ్: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్, ఆయుష్ బదోని, సూర్యాంశ్ షెడ్గే, విప్రాజ్ నిగమ్, నిషాంత్ సింధు, గుర్జప్‌నీత్ సింగ్, యుధ్వార్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), ప్రియాంశ్ ఆర్య, సిమ్రజీత్ సింగ్

మిగతా రెండు మ్యాచులకు: బీ శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), రియాన్ పరాగ్, ఆయుష్ బదోని, సూర్యాంశ్ షెడ్గే, విప్రాజ్ నిగమ్, నిషాంత్ సింధు, గుర్జప్‌నీత్ సింగ్, యుధ్వార్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), ప్రియాంశ్ ఆర్య, సిమ్రజీత్ సింగ్, హర్షిత్ రాణా, అర్ష్ దీప్ సింగ్.

## ఆస్ట్రేలియా-ఏతో రెండో అనధికార టెస్ట్..

# పుంజుకున్న ఇండియా-ఏ

**- అర్ధసెంచరీతో రాణించిన రాహుల్**



ఆస్ట్రేలియా-ఏతో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో ఇండియా-ఏ పుంజుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో 16/3తో మూడో రోజు గురువారం ఆటను ప్రారంభించిన ఆస్ట్రేలియా-ఏ 185 పరుగులకు ఆలౌటైంది. నాథన్ మెక్‌స్వీనీ (85), జోష్ ఫిలిప్ (50) రాణించారు. మానవ్ సుతార్ (3/50), గుర్నూర్ బ్రార్ (3/42), సిరాజ్ (2/20), యశ్ ఠాకూర్ (2/29) బంతితో మెరిసి ప్రత్యర్థి జట్టును కట్టడి చేశారు. 412 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్సును మొదలు పెట్టిన ఇండియా-ఏకు శుభారంభం దక్కింది. మూడో రోజు ఆట ముగిసే సరికి రెండు వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. ఇండియా ఏ విజయానికి ఇంకా 243 పరుగులు కావాలి.

ఓపెనర్లు నారాయణ్ జగదీశన్ (36, 55 బంతుల్లో 5 ఫోర్లు), కేఎల్ రాహుల్ (74 రిటైర్డ్ హర్ట్: 92 బంతుల్లో 9 ఫోర్లు) తొలి వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. నిలకడగా ఆడుతున్న జగదీశన్‌ను టాడ్ మార్ఫీ ఔట్ చేశాడు. కేఎల్ రాహుల్ మాత్రం దూకుడుగా ఆడి 55 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. అతను 74 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద బ్యాటింగ్ చేయలేక ఫిజియో సాయంతో రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడాడు. సాయి సుదర్శన్ (44 నాటౌట్: 84 బంతుల్లో), మానవ్ సుతార్ (1 నాటౌట్) క్రీజులో ఉన్నారు. మ్యాచ్‌లో ఇంకా ఒక రోజు మిగిలి ఉండగా భారత్ విజయానికి 243 పరుగులు అవసరం. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా-ఏ 420, ఇండియా-ఏ 194 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.

చైతన్య రథం సినిమా
శుక్రవారం 26 సెప్టెంబర్ 2025 

# మారుతి మార్క్ ట్రైలరేనట



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు మారుతీ తెరకెక్కిస్తున్న హారర్ ఫాంటసీ ఎంటర్టైనర్-ది రాజా సాబ్. ప్రభాస్ నుంచి చాలాకాలం తర్వాత ఒక రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న సినిమా కావడంతో ఫ్యాన్స్‌లో మంచి హైప్ ఉంది. ఇక సినిమా తాలూకు ట్రైలర్‌ని మేకర్స్ అక్టోబర్‌లో రిలీజ్ చేయనున్న సంగతి తెలిసిందే. ఈ ట్రైలర్‌కి రన్ టైం లాక్ చేసినట్టు టాక్ వినిపిస్తోంది. రాజా సాబ్ మొదటి ట్రైలర్ 3నిమిషాలకి మించిన నిడివితో రానున్నట్టు కన్ఫర్మ్ చేస్తున్నారు. అక్టోబర్ 2న పాన్ ఇండియా మూవీ కాంతార-1తో థియేటర్స్‌లో 'ది రాజా సాబ్' ట్రైలర్ సందడి చేసేందుకు సిద్ధమైనట్టు కూడా ఇండస్ట్రీలో టాక్‌వినిపిస్తోంది. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఏమిస్తారో చూడాలి.

# యూనివర్స్‌ని సృష్టిస్తున్న సుజీత్



పవన్ కళ్యాణ్ లీడ్ రోల్‌తో థియేటర్స్‌కు వచ్చిన చిత్రమే "ఓజీ". డైరెక్టర్ సుజీత్ తెరకెక్కించిన యాక్షన్ గ్యాంగ్‌స్టర్ డ్రామా భారీ హైప్ నడుమ థియేటర్స్‌ని ఆక్యుపై చేసింది. అయితే ఎప్పటినుంచో ఓ క్రేజీ సర్‌ప్రైజ్ ఉన్నట్టుగా గట్టి టాక్ వినిపించిన సంగతి తెలిసిందే. సుజీత్ తన సినిమాటిక్ యూనివర్స్‌ని ఈ సినిమాతో మొదలు పెడుతున్నాడని.. సాహో సినిమాకి ఓజీతో లింక్ పెట్టాడని క్రేజీ బజ్ వచ్చింది. అనుకున్నట్టుగానే నిన్న ప్రీమియర్స్‌తోనే తాను 'ఎస్‌సియూ' అంటూ తన సినిమాటిక్ యూనివర్స్‌పై హింట్ ఇచ్చాడు. ఇలా ఇక సినిమాలో కూడా మ్యాడ్ కనెక్షన్‌తో ఓజీ, సాహో సినిమాలకి లింక్ పెట్టడం జరిగింది. ఇది థియేటర్స్‌లో పవన్ ఇంకా రెబల్ స్టార్ ఫ్యాన్స్‌కి ఒక మ్యాడ్ లెవెల్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించింది. దీంతో ఓజి పార్ట్-2పై మరింత బజ్ నెలకొంది. ఇక తరువాతి సినిమాలు తాను ఎలా ప్లాన్ చేస్తాడు అనేది టఫ్ క్వశ్చన్. ఓజీ వర్కౌట్ అయితే.. మరో సాలిడ్ సినిమాటిక్ యూనివర్స్ పడటం ఖాయం.



## ఇడ్లీకొట్టు:
# 147 మినిట్స్!

దర్శకుడిగా తన సత్తా చాటేందుకు ధనుష్ మరోసారి సిద్ధమయ్యాడు. ఆయన తెరకెక్కించిన లేటెస్ట్ చిత్రం 'ఇడ్లీ కడై'. తెలుగులో 'ఇడ్లీ కొట్టు' టైటిల్‌తో రిలీజ్‌కానుంది. ఈ సినిమాలో ధనుష్‌కు జోడీగా నిత్యామీనన్ నటిస్తోంది. చిత్రం అక్టోబర్ 1న విడుదల కానుంది. ఇక ఇప్పటికే విడుదలైన థియేట్రికల్ ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ లభించింది. కాగా సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. తాజాగా ఈ చిత్ర రన్‌టైమ్‌ను రివీల్ చేశారు. ఈ చిత్ర నిడివి 147 నిమిషాలుగా ఖరారైంది. చిత్రంలో అరుణ్ విజయ్, శాలినీ పాండే, సత్యరాజ్, రాజ్‌కిరణ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిలింస్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చాడు.

# అఖండ.. ఇదీ రిలీజ్ డేట్



నందమూరి బాలకృష్ణ నటిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'అఖండ 2' షూటింగ్ దాదాపు పూర్తైంది. నిర్మాణంలో ఆలస్యం కారణంగా ఇప్పటికే రిలీజ్ కావాల్సిన సినిమా.. ఇప్పుడు పూర్తి చేసుకుంది. దీంతో సినిమా రిలీజ్ డేట్‌ను రీసెంట్‌గా బాలకృష్ణ స్వయంగా డిసెంబర్‌లో విడుదలవుతుందని ప్రకటించారు. అయితే, తాజాగా పవన్‌కళ్యాణ్ ఓజీ చిత్ర ప్రీమియర్ షోలో 'అఖండ-2' రిలీజ్ డేట్‌పై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. డిసెంబర్ 5న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నట్టు ఓ టీజర్‌ను ప్రింట్స్‌కు జతచేసి ప్రదర్శించారు. ఇక ఈ వార్త నందమూరి అభిమానులకు నిజంగా పెద్ద పండుగ. చిత్రంలో సంయుక్తామీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆది పినిశెట్టి విలన్‌గా కనిపించనున్నారు. బాలీవుడ్ చైల్డ్ ఆర్టిస్ట్ హర్షాలీ మల్హోత్రా ఈ చిత్రంతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తోంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీనాథ్ ఆచంట భారీ స్థాయిలో నిర్మిస్తుండగా, ఎం తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు. థమన్ ఈ చిత్రానికి సంగీతం సమకూర్చాడు..

# రిలీజ్ డేట్ దసరాకు చెప్తా



రవితేజ కథానాయకుడిగా తెరకెక్కిన 'మాస్ జాతర' విడుదల తేదీని దసరా సందర్భంగా అక్టోబరు 2న ప్రకటించనున్నట్టు తెలిపారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ. ఆయన, సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'మాస్ జాతర. రవితేజకు జోడీగా శ్రీలీల నటించారు. భాను భోగవరపు దర్శకుడు. ఈ చిత్రం ఈ ఏడాది మే నెలలోనే విడుదల కావల్సి ఉండగా, ఆగస్టుకి వాయిదా పడింది. ఆగస్టులోనూ ఈ చిత్రం విడుదల కాలేదు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ బుధవారం సామాజిక మాధ్యమాల్లో స్పందిస్తూ... దసరా రోజున 'మాస్ జాతర' విడుదల తేదీని ప్రకటించనున్నట్టు తెలిపారు. ఆ వెంటనే ప్రచార కార్యక్రమాలు మొదలు పెడతామని ఆయన స్పష్టం చేశారు. విజయవంతమైన 'ధమాకా' తర్వాత రవితేజ, శ్రీలీల కలిసి నటించిన చిత్రమిది. రవితేజ పోలీసు అధికారి పాత్రలో సందడి చేయనున్నారు.

# అసలు.. భరణం అడగలేదు

యుజ్వేంద్ర చాహల్‌తో విడాకులపై ధనశ్రీ వర్మ తాజాగా ఓ షోలో మాట్లాడారు. తాను భరణం డిమాండ్ చేసినట్టు కొన్ని నెలలుగా సోషల్ మీడియాలో వైరలవుతోన్న ప్రచారాన్ని ఖండించారు. చాహల్ నుంచి విడాకులు తీసుకున్న సమయంలో ధనశ్రీ రూ.60 కోట్లు భరణంగా అడిగినట్టు అప్పట్లో మీడియాలో వచ్చిన కథనాలపై స్పందిస్తూ.. 'అవన్నీ అవాస్తవం. పరస్పర సమ్మతితో విడిపోయినప్పుడు భరణమనే అంశమే ఉండదు' అన్నారు ధనశ్రీ. ప్రస్తుతం 'రైజ్ అండ్ ఫాల్' అనే రియాలిటీ షోలో ధనశ్రీ పోటీపడుతోన్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో ఆమె చాహల్‌నుంచి విడిపోవడం గురించి ప్రస్తావించారు. "మేం పరస్పర అంగీకారంతో విడిపోయాం. అందుకే త్వరగా విడాకులు మంజూరయ్యాయి. ఇదంతా ఒకప్పటి సంగతి. నేను ఈ విషయంలో మౌనంగా ఉండడంతో ప్రజలు వారికి నచ్చినది రాసుకున్నారు. మన గురించి తెలియనివారు చేసే ప్రచారంపై స్పందించినా సమయం వృథా తప్ప దానివల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. కానీ, భరణం వార్తలు చూసి బాధపడ్డాను. అవి ఎలా బయటకు వచ్చాయో తెలియదు. నేను ఇప్పటికీ చాహల్‌ను గౌరవిస్తూనే ఉన్నాను" అని ధనశ్రీ తెలిపారు. కొన్ని నెలల డేటింగ్ అనంతరం చాహల్, ధనశ్రీ 2020 డిసెంబర్లో వివాహం చేసుకున్నారు. ఇద్దరికీ అభిప్రాయ భేదాలు రావడంతో విడాకులు తీసుకున్నారు. 2025 ఫిబ్రవరిలో బాంద్రాలోని కుటుంబ న్యాయస్థానం వీరికి విడాకులు మంజూరుచేసింది.



# జుబీన్ కేసులో అనుమానితుల అరెస్ట్

అస్సాంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ (52) ఇటీవల సింగపూర్‌లో ప్రమాదవశాత్తూ మృతిచెందిన విషయం తెలిసిందే.ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.(ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు దర్యాప్తు కొనసాగుతోంది. ఆయన మేనేజర్, ఈవెంట్ ఆర్గనైజర్ ఇళ్లలో ప్రత్యేక దర్యాప్తు బృందం సోదాలు నిర్వహించింది. అలాగే సౌండ్ రికార్డిస్ట్ నివాసంలోనూ తనిఖీలు జరిగాయి. అలాగే మ్యూజీషియన్ శేఖర్ జ్యోతిగోస్వామిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఆయనను విచారించనున్నారు. జుబీన్ మరణానికి ముందు ప్రయాణించిన నౌకలో ఉన్న బృందంలో గోస్వామి కూడాఉన్నారని తెలుస్తోంది. ఈ అరెస్టు విషయాన్ని అధికారులు ధ్రువీకరించారు. సింగర్ మృతికి కారణమైన వారిని వదిలేది లేదని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ ప్రకటించిన సంగతి తెలిసిందే. "ఈ అంశంపై పోలీసు డిపార్ట్‌మెంట్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యాను. దీనిపై సిట్‌ను ఏర్పాటుచేయాలని డీజీపీని ఆదేశించా. ఈ కేసు విషయంలో ప్రత్యేక దర్యాప్తు బృందానికి పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నా" అని ఎక్స్ వేదికగా పోస్టుపెట్టిన సంగతి తెలిసిందే. ఈనెల 19న సింగపూర్‌లో సముద్ర ఈతకు వెళ్లిన జుబీన్ ప్రమాదవశాత్తు అక్కడే మృతిచెందిన విషయం విధితమే.

# పిల్లలు కావాలనిపిస్తుంది!



ఇన్నాళ్లూ పెళ్లి, పిల్లల గురించి ఆలోచించని బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్.. తొలిసారి తనకు పిల్లలు కావాలంటూ మనసులో మాట బయటపెట్టారు. 'టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్' టాక్ షోలో ఆమీర్‌ఖాన్‌తో కలసి సల్మాన్ పాల్గొన్నారు. వచ్చే డిసెంబరుకు 60ఏట పడుతున్న సల్మాన్.. ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. షోలో ట్వింకిల్ మాట్లాడుతూ.. "సల్మాన్ ఎప్పుడో తనని తాను 'నవ మన్మథుడు'గా పేర్కొన్నాడు. అయితే, ఆయనకు డజనుమంది పిల్లలుండి ఉండొచ్చు. కానీ, వాళ్ల గురించి మనకు తెలియదు. ఆ విషయం నీక్కూడా (సల్మాన్) తెలిసే అవకాశం లేదులే అంటూ సరదాగా జోక్ వేసింది. వెంటనే స్పందించిన సల్మాన్ 'నాకు పిల్లలుంటే నీకు తెలియకుండా ఉంటుందా. ఒకవేళ పిల్లలుంటే వాళ్లను మీ ముందుకు తీసుకురాకుండా ఉంటానా' అని సమాధానమిచ్చారు. దత్తత తీసుకునే ఆలోచన ఏమైనా ఉందా? అని అడగ్గా, అసలు అలాంటి ఆలోచనే లేదన్నారు. అయితే, భవిష్యత్‌లో తప్పకుండా తనకు పిల్లలు కావాలని అన్నారు. అందుకు సమయం ఉందా? అని ట్వింకిల్ ప్రశ్నించగా, "ఎప్పుడైనా జరగొచ్చు. కచ్చితంగా ఒక బిడ్డ అయితే ఉంటుంది. భవిష్యత్‌లో ఏం జరుగుతుందో చెప్పలేం కదా! దేవుడి దయ" అంటూ సల్మాన్ సమాధానమిచ్చారు. తనకు పిల్లలు పుడితే, తన కుటుంబం వారి ఆలనా పాలనా చూసుకుంటుందని అన్నారు. 'టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్ షో సెప్టెంబర్ 25 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతోంది. మొదటి ఎపిసోడ్‌లో సల్మాన్- ఆమీర్ పాల్గొని సందడి చేశారు.